

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 17-08-2025 | సంపుటి - 24 | సంచిక - 102 | రూ : 4 | పేజీలు: 8




2లో

## నాగార్జునసాగర్ కు జలకళ

### భారీగా తరలివస్తున్న పర్యాటకులు

- నాగార్జున సాగర్‌కు భారీగా పెరిగిన వరద ప్రవాహం
- 5 అడుగుల మేర 20 క్రస్ట్ గేట్ల ఎత్తివేత
- దిగువకు 1.40 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల
- జలసౌందర్యాన్ని చూసేందుకు పోటెత్తిన పర్యాటకులు
- వారాంతం కావడంతో భారీగా సందర్శకుల రద్దీ
- ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించిన పోలీసులు

# తెలంగాణకు భారీ వర్ష సూచన..

## అధికారులకు రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షా లు కురిసే అవకాశం
- ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచన
- జలాశయాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని సూచన



2లో



2లో

## 'స్త్రీ శక్తి' పథకంపై నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్

భారత్‌పై టారిఫ్‌లు.. మెత్తబడిన ట్రంప్.. ఆంక్షలు ఉండకపోవచ్చని సంకేతం

6లో



2లో

## రేవంత్ రెడ్డి చదివింది చంద్రబాబు స్క్రిప్టే

- సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఆగ్రహం
- చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టునే రేవంత్ చదువుతున్నారని ఆరోపణ
- బనకచర్ల కుట్రకు అనుకూలంగా సీఎం వ్యాఖ్యలు
- గోదావరి జలాలపై మరో ప్రాజెక్టు కట్టేందుకు యత్నం
- తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని విమర్శ

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మంత్రుల సమావేశం



- నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలన్న మంత్రులు
- పార్టీ గెలుపు కోసం తగిన విధంగా పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపు
- అభ్యర్థి ఎవరైనా పార్టీ విజయం కోసం కృషి చేయాలన్న మంత్రులు

హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని ఎర్రగడ్డ డివిజన్ బూత్ ఇన్‌ఛార్జ్‌లు, ముఖ్య నేతలతో మంత్రులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తరువాయి 2లో

## కాళేశ్వరంను 'కూలేశ్వరం' అన్నారు... పోలవరంను 'కూలవరం' అనే దమ్ముందా?

- మేడిగడ్డలో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే కూలేశ్వరం అన్నారని కేటీఆర్ మండిపాటు
- పోలవరం కాఫర్ డ్యాం రెండో సారి కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏ మౌనంగా ఉందని విమర్శ
- ఇది కేసీఆర్ పై బీజేపీ, కాంగ్రెస్ చేస్తున్న కుట్ర అని ఆరోపణ



2లో

# బీహార్ లో 'ఓట్ అధికార్ యాత్ర'.. చేపట్టిన రాహుల్ గాంధీ

- బీహార్‌లో రాహుల్ గాంధీ 'ఓట్ అధికార్ యాత్ర' ప్రారంభం
- ఓటర్ల జాబితాలో అక్రమాలపై కాంగ్రెస్ తీవ్ర నిరసన
- 16 రోజుల పాటు రాష్ట్రంలోని 23 జిల్లాల్లో యాత్ర
- యాత్రకు మద్దతు ప్రకటించిన మహాగఠ్‌బంధన్ మిత్రపక్షాలు
- ఓట్ల తొలగింపును 'ఓట్‌బందీ'గా అభివర్ణించిన విపక్షాలు
- రాహుల్ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన ఎన్నికల సంఘం



2లో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మంత్రుల సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావులు మాట్లాడుతూ, నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం పార్టీ శ్రేణులు తగిన విధంగా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఎర్రగడ్డ డివిజన్‌లో నేతలంతా ఐక్యంగా పనిచేయాలని సూచించారు. అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేయాలని సూచించారు. డివిజన్ బూత్ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తే రాష్ట్ర అభివృద్ధికి సంకేతమవుతుందని వ్యాఖ్యానించారు.

## 'స్త్రీ శక్తి' పథకంపై నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్

**అమరావతి :** రాష్ట్రంలోని మహిళలకు కానుకగా కూటమి ప్రభుత్వం 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. తాజాగా రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... సూపర్ సిక్స్ హామీలలో ఒకటైన ఈ పథకాన్ని ప్రారంభించడం గర్వంగా ఉందని తన పోస్టులో పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం కేవలం ఒక సౌకర్యం మాత్రమే కాదని, అది వారి స్వేచ్ఛకు, గౌరవానికి, ప్రభుత్వంపై వారికున్న నమ్మకానికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. "ఈ ఉచిత బస్సు టికెట్ మహిళల సాధికారతకు ప్రతీక. ఇది కేవలం ప్రయాణం కాదు, సమాన అవకాశాల దిశగా వేస్తున్న ఒక ముందడుగు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళా సాధికారతకు మా ప్రభుత్వం పట్టం కట్టింది" అని లోకేశ్ తెలిపారు. ఈ చారిత్రక సందర్భాన్ని ఒక వేడుకలా జరుపుకోవాలని ఆయన రాష్ట్రంలోని మహిళలకు పిలుపునిచ్చారు.

# రేవంత్ రెడ్డి చదివింది చంద్రబాబు స్క్రిప్టే

**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి సొంత ఆలోచనలతో మాట్లాడటం లేదని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టును యథాతథంగా చదువుతున్నారని ఆయన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు తెలంగాణ ప్రయోజనాలకు గండి కొట్టేలా ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు పూర్తిగా 'బనకచర్ల కుట్ర'కు అనుకూలంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. పొరుగు రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చేందుకే ఆయన అలా మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలను పక్కనపెట్టి, చంద్రబాబు డైరెక్షన్‌లో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. గోదావరి జలాల వినియోగంపై కూడా ఆయన స్పందించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గోదావరి నీటిపై కొత్తగా మరో ప్రాజెక్టు నిర్మించడానికి ఏమాత్రం అవకాశం లేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ, కొత్త ప్రాజెక్టుల గురించి మాట్లాడటం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.



## తెలంగాణకు భారీ వర్ష సూచన..

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాల ప్రభావం అధికంగా ఉండే జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సహా అన్ని సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వాగులు పొంగే ప్రమాదమున్న జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జలాశయాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని సూచించారు.

### కాళేశ్వరంను 'కూలేశ్వరం' అన్నారు...
# పోలవరంను 'కూలవరం' అనే దమ్ముందా?

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు దెబ్బతింటే 'కూలేశ్వరం' అంటూ విమర్శలు గుప్పించిన కాంగ్రెస్, బీజేపీ నేతలకు, ఇప్పుడు రెండోసారి కాఫర్ డ్యామ్ కొట్టుకుపోయిన పోలవరం ప్రాజెక్టును 'కూలవరం' అని నిందించే ధైర్యం ఉందా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం, జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్డీఎస్ఏ) పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో మేడిగడ్డ వద్ద చిన్న సమస్య తలెత్తగానే, 24 గంటల్లోపే ఎన్డీఎస్ఏను రంగంలోకి దించి బీఆర్ఎస్‌పై బురదజల్లే ప్రయత్నం చేశారని కేటీఆర్ ఆరోపించారు. కానీ, సాక్షాత్తూ ఎన్డీఏ ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ ప్రాజెక్టయిన పోలవరం కాఫర్ డ్యామ్ రెండోసారి దెబ్బతిన్నా కేంద్ర సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని ఆయన నిలదీశారు. ఆంధ్రప్రదేశ్‌లో 10 అడుగుల వెడల్పు, 8 అడుగుల లోతు మేర కాఫర్ డ్యామ్ కొట్టుకుపోతే, యుద్ధప్రాతిపదికన గుట్టుచప్పుడు కాకుండా మరమ్మతులు చేస్తున్నారని అన్నారు. అదే సమయంలో, తెలంగాణలో 20 నెలలు గడుస్తున్నా మేడిగడ్డ వద్ద కనీస మరమ్మతు పనులు కూడా చేపట్టకపోవడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మూర్ఖత్వమే కారణమని విమర్శించారు.



## శ్రీశైలం ప్రాజెక్టు 5గేట్లు ఎత్తి నీటి విడుదల

శ్రీశైలం (సున్నిపెంట సర్కిల్): శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతుండటంతో మరో గేటును ఎత్తారు. ప్రస్తుతం 5 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలంలో 1,89,169 క్యూసెక్కులు చేరుతోంది. శ్రీశైలం నుంచి 2,34,544 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 35,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,509 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 5 స్పిల్ వే గేట్ల ద్వారా 1,33,720 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.10 అడుగులకు చేరింది.

# నాగార్జునసాగర్ కు జలకళ... భారీగా తరలివస్తున్న పర్యాటకులు

వరుస సెలవులు రావడంతో నాగార్జున సాగర్ వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో జలాశయం నిండుకుండలా మారింది. అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడంతో, ఆ జలసౌందర్యాన్ని కళ్లారా చూసేందుకు సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్న దృశ్యాలను తమ కెమెరాలలో బంధిస్తూ, సెల్ఫీలు తీసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం అధికంగా ఉండటంతో, ప్రాజెక్టు అధికారులు శనివారం నాడు జలాశయానికి చెందిన 20 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర పైకి ఎత్తారు. దీని ద్వారా స్పిల్‌వే నుంచి సుమారు 1.40 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గేట్ల నుంచి ఉప్పొంగి ప్రవహిస్తున్న కృష్ణా జలాలు కనువిందు చేశాయి. పర్యాటకులు ఒకేసారి పెద్ద సంఖ్యలో వాహనాల్లో రావడంతో నాగార్జున సాగర్ డ్యామ్ వద్ద కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు, ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాలు సాఫీగా ముందుకు సాగేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

# బీహార్ లో 'ఓట్ అధికార్ యాత్ర' చేపట్టిన రాహుల్ గాంధీ

బీహార్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఓటర్ల జాబితా నుంచి పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ, దీనిని 'ఓట్‌బందీ'గా అభివర్ణిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళన బాట పట్టారు. ఎన్నికల సంఘం (ఈసీ) తీరుకు నిరసనగా ఆయన శనివారం 'ఓట్ అధికార్ యాత్ర'ను ప్రారంభించారు. ఈ యాత్ర రాష్ట్రవ్యాప్తంగా 16 రోజుల పాటు సాగనుంది. ఆదివారం నుంచి లాంఛనంగా ప్రారంభం కానున్న ఈ యాత్ర 23 జిల్లాల మీదుగా కొనసాగనుంది. ససారామ్‌లో ఈ యాత్రను ప్రారంభించారు. ఈ నిరసన కార్యక్రమానికి మహాగఠ్‌బంధన్ మిత్రపక్షాలు కూడా పూర్తి మద్దతు ప్రకటించాయి. కాంగ్రెస్‌తో కలిసి తాము కూడా ప్రజలను సమీకరిస్తామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తెలిపారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై విపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈసీ, బీజేపీతో కుమ్మక్కై ఓట్లను తొలగిస్తోందని ఆగస్టు 7న రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. దీనికి ఆధారంగా కర్ణాటకలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ డేటాను ఆయన ప్రస్తావించారు. అయితే, ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం తీవ్రంగా ఖండించింది. అఫిడవిట్ రూపంలో ఫిర్యాదు చేయాలని కోరగా, తాను రాజ్యాంగంపై ప్రమాణం చేసినందున ఆ అవసరం లేదని రాహుల్ బదులిచ్చారు. "ప్రతి వ్యక్తికి ఒక ఓటు అనేది ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు. దానిని కాపాడేందుకే ఈ పోరాటం. రాజ్యాంగ పరిరక్షణ కోసం బీహార్‌లో మాతో కలవండి" అని రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా పిలుపునిచ్చారు. మరోవైపు, తేజస్వీ యాదవ్ ఈ యాత్ర కోసం ఒక ప్రచార గీతాన్ని విడుదల చేశారు. "ఏ ఒక్క ఓటరు పేరు జాబితా నుంచి పోకూడదు. ప్రజల్లో చైతన్యం తేవడమే మా లక్ష్యం" అని ఆయన స్పష్టం

# సెరామిక్ పాత్రలు.. శుభ్రం చేయాలంటే..!

**ఇంటికి అతిథులొచ్చినప్పుడు హుందాగా కనిపించడమే కాదు.. వంటా వార్పు విషయాల్లోనూ హుందాగా వ్యవహరిస్తుంటాం. వంట చేసేటప్పుడు ఉపయోగించే పాత్రలైనా, వడ్డించేటప్పుడు వాడే ప్లేట్స్ అయినా కాస్త ఖరీదైనవి ఎంచుకుంటాం. అలాంటి వంట పాత్రల్లో సెరామిక్ కుక్‌వేర్ ముందు వరుసలో ఉంటుంది. అయితే వీటిని వినియోగించడం వరకే కాదు.. శుభ్రపరిచే విషయంలోనూ పలు జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. అప్పుడే అవి ఎక్కువ కాలం మన్నుతాయంటున్నారు. మరి, సెరామిక్ వంట పాత్రల్ని ఎలా శుభ్రం చేయాలో తెలుసుకుందాం రండి..**



* కొంతమంది సమయం లేకపోవడం వల్లో లేదంటే త్వరగా పని పూర్తి చేసుకోవాలన్న ఉద్దేశంతోనో.. వేడిగా ఉన్నప్పుడే సెరామిక్ పాత్రల్ని శుభ్రం చేస్తుంటారు. వాటిని కుళాయి కింద పెడితే చల్లబడతాయనుకుంటారు. అయితే ఇలా ఉష్ణోగ్రతలో ఉన్నట్లుండి మార్పు రావడం వల్ల వాటిపై ఉండే నాన్‌స్టిక్ సెరామిక్ కోటింగ్ తొలగిపోతుందంటున్నారు నిపుణులు. అందుకే వంట పూర్తయ్యాక అవి సాధారణ గది ఉష్ణోగ్రత వద్దకొచ్చాక మాత్రమే వాటిని శుభ్రం చేయాలంటున్నారు.
* ఒకవేళ సెరామిక్ పాత్రలు మాడిపోయినట్లయితే.. అలాంటి వాటిని బేకింగ్ సోడాతో శుభ్రం చేయచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో పాత్రలో పొడి బేకింగ్ సోడాను చల్లాలి. ఆపై మృదువుగా ఉన్న స్పాంజితో గుండ్రంగా రుద్దాలి. ఆపై సాధారణ డిటర్జెంట్‌తో కడిగేస్తే సరిపోతుంది. ఇక బేకింగ్ సోడా, గోరువెచ్చటి నీళ్ల మిశ్రమంతో ఈ పాత్రల్ని శుభ్రం చేసినా సమాన ఫలితం ఉంటుంది.
* ఒక వంతు వెనిగర్‌కు నాలుగు వంతుల నీళ్లు తీసుకొని మిశ్రమంగా చేసుకోవాలి. దీన్ని శుభ్రం చేయాల్సిన సెరామిక్ పాత్రలో పోసి.. రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే సబ్బుతో శుభ్రం చేస్తే.. వంట చేసే క్రమంలో వాటిపై ఏర్పడిన మరకలు, జిడ్డుదనం.. అన్నీ తొలగిపోతాయి.
* టేబుల్‌స్పూన్ చొప్పున ఉప్పు, వెనిగర్ తీసుకొని మిశ్రమంగా తయారుచేసుకోవాలి. దీంతో ముందుగా సెరామిక్ పాత్రలు/ప్లేట్స్ శుభ్రం చేసి.. ఆపై డిటర్జెంట్‌తో కడిగేస్తే అవి కొత్తవాటిలా మెరుస్తాయి.



* వంట త్వరగా పూర్తవ్వాలన్న ఉద్దేశంతో కొంతమంది ఎక్కువ మంటపై వంట చేస్తుంటారు. సెరామిక్ పాత్రల్ని ఇలా పెద్ద మంటపై ఉంచితే వాటిలోని నాన్‌స్టిక్ కోటింగ్ త్వరగా పోతుంది.. కాబట్టి సెరామిక్ పాత్రల్ని చిన్న మంట పైనే పెట్టి వంట చేయడం మంచిది.
* సెరామిక్ ప్లేట్స్‌లో ఆహార పదార్థాలు కట్ చేయడం, వాటిపై పడిన మరకలు తొలగిపోవాలని గరుకైన స్క్రబ్బర్‌తో వాటిని రుద్దడం.. వంటివి చేస్తే వాటిపై ఉండే నాన్‌స్టిక్ కోటింగ్ తొలగిపోయి.. గీతలు పడతాయి. తద్వారా అవి త్వరగా పాడైపోతాయి.
* సెరామిక్ పాత్రల్ని డిష్‌వాషర్‌లో వేయడం, వాటిని శుభ్రం చేయడానికి బ్లీచ్‌ఆమ్ల గుణాలున్న పదార్థాల్ని వాడడం.. వంటివి చేసినా అవి త్వరగా పాడవుతాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండడం మంచిది.
* **సెరామిక్ పాత్రలు ఎక్కువ కాలం మన్నాలంటే వాటి ఉపయోగం, వాడకం.. వంటి విషయాల్లోనే కాదు.. వాటిని భద్రపరిచేటప్పుడూ పలు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా కడిగిన పాత్రల్ని తేమగా ఉన్నప్పుడు కాకుండా.. ఒక కాటన్ క్లాత్‌తో వాటిని పొడిగా తుడిచి.. కాసేపు గాలికి పూర్తిగా ఆరాకే వాటిని అల్మరాలో భద్రపరచాలి.**



# జెఎస్‌డబ్ల్యూ పెయింట్స్ వారిచే పెయింటర్లకు అవగాహన



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: సిరి ట్రేడర్స్ యజమాని ఆది లక్ష్మణ్ ఆధ్వర్యంలో జెఎస్‌డబ్ల్యూ పెయింట్స్ వారిచే ముస్తాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పెయింటర్స్‌కు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక దత్త సాయి గార్డెన్స్‌లో ఈ సదస్సు జరిగింది. జెఎస్‌డబ్ల్యు పెయింట్స్ ప్రతినిధి ప్రణీత్ మాట్లాడుతూ పెయింటర్లకు, కాంట్రాక్టర్లకు పెయింట్స్ వాడకంలో మెలుకువలను వివరించారు. కంపెనీ ద్వారా పెయింటర్లకు వచ్చే స్కీములను, వివిధ రకాల రంగుల నాణ్యతకు, మన్నిక, దీర్ఘ కాలికతకు సంబంధించిన విషయాలను గురించి చెప్పారు. వినియోగదారులతో రంగుల ఎంపిక, నాణ్యత వంటి విషయాలను ఎలా వివరించాలో తెలియజేశారు. జెఎస్‌డబ్ల్యు పెయింట్స్ ద్వారా నెల, త్రైమాసిక, వార్షిక పథకాలను తెలియజేశారు. అనంతరం సిరి ట్రేడర్స్ ప్రొప్రైటర్ ఆది లక్ష్మణ్ మాట్లాడుతూ జెఎస్‌డబ్ల్యూ పెయింట్స్ కంపెనీ పెయింటర్లకు, కాంట్రాక్టర్లకు పాయింట్స్ రూపంలో మంచి బహుమతులను పొందే అవకాశం ఉందని, పెయింటర్ తనకు రోజువారి కూలీ ద్వారానే వచ్చే డబ్బులు కాకుండా ఈ పాయింట్స్‌ను ఉపయోగించుకొని ఇంకా ఎక్కువ డబ్బులు పొందవచ్చునని, ఈ అవకాశాన్ని పెయింటర్స్ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం పెయింటర్స్‌కు గొడుగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, తాటకర్ల వేణు, అనమేని నవీన్ తదితరులున్నారు.

## ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: అశ్వారావుపేట నియోజకవర్గం, ఎర్రగుంట మండలం,జానకిపురం శ్రీకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకోదండ రామాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు నాగాసీతారాములును, వల్లపు. యాకయ్య ను శాలువాతో సన్మానించి సత్కరించారు. కృష్ణాష్టమి సందర్భముగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర యువజన సెక్రెటరీ వల్లపు.యాకయ్య యాదవ్,జిల్లా సెక్రటరీ కుక్కల.సాంబయ్య యాదవ్, పాల్వంచ టౌన్ సెక్రెటరీ మారుతి శ్రీనివాస్ యాదవ్,యాదవసంఘ నాయకులు అమడగానీ. జయ ప్రకాష్,బొబ్బల.వెంకట్ యాదవ్ జల్లారపు.సాయిచందు, చంటి,మరియు కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు..



అందోలు, ప్రజాస్ఫూర్తి: హిందువులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండగలలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఒకటి. శనివారం అందోలు మండలంలోని కన్సాన్ పల్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిన్నారులు, విద్యార్థులు గోపికలు శ్రీకృష్ణుడి వేషధారణలో ముస్తాబయి సందడి చేశారు.చిన్న పిల్లలకు రాధాకృష్ణ అవతారాలు వేసి ఫొటోలు తీస్తుకున్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



ప్రజాస్ఫూర్తి, కూకట్పల్లి :శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కూకట్పల్లి కమలప్రసన్న నగర్ కాలనీ లోని ఇస్కాన్ టెంపుల్ లో ఘనంగా నిర్వహించిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలకు ముఖ్యఅతిధిగా ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరైనాడు.ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని భక్తులందరితో కలిసి అభిషేకాలు అర్చనలతో హరే రామ హరే కృష్ణ సంకీర్తనలతో స్వామి వారిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ యశోదా శ్రీకృష్ణుని ఆశీర్వాదం ఎల్లవేళలా మనందరిపైన ఉండాలని అన్నాడు. ప్రజలందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేసి కృష్ణాష్టమి పండుగను అత్యంత సుందరంగా, ఘనంగా నిర్వహించిన కూకట్పల్లి ఇస్కాన్ ఆలయ పెద్దలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి ఇస్కాన్ టెంపుల్ ప్రెసిడెంట్ మహా శ్రీంగదాస్, జై శ్రీకృష్ణ ప్రభుజి, శ్రీవాణి మాతాజీ, భారతి మాతాజీ, అనిల్ ధీరజ్ ప్రభుజి, అచ్యుత ప్రభుజి, సునీల్ రాటి ప్రభుజి, సాధన భక్తి మాతాజీ, డి.నరసింహులు, పోశెట్టిగౌడ్, రాములు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- ముస్తాబాద్ ఎస్ఐ గణేష్**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఒక ప్రకటనలో వివరించారు. వాగులు, వంకలు, నదుల వద్ద వరద ప్రవాహం అధికంగా ఉంటుందని, వాటి వద్దకు ఎవరూ వెళ్లవద్దని సూచించారు. రైతులు పొలాల్లో, విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభాలను గానీ, వైర్లను గానీ చేతులతో తాకవద్దని సూచించారు. మానేరు పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జలాశయాలు, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్ద మత్స్యకారులు, ప్రజలు ఎవరూ కూడా చేపల వేటకు వెళ్లకూడదని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్లరాదని అన్నారు. వర్షం వల్ల వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉందని, కావునా పరిమిత వేగంతో నడపాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా అత్యవసరమైతే ఇంటి నుంచి బయటకు వెళ్లాలని సూచించారు. పిల్లలు , యువకులు నది దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈతలు కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూచించారు. విపత్కర సమయాల్లో సహాయం కోసం డయల్ 100కి లేదా దగ్గరలో ఉన్న పోలీసు వారికి సమాచారం అందించాలని, తక్షణ సహాయ చర్యలు చేపడుతామని తెలిపారు.

## జెఎస్‌డబ్ల్యూ పెయింట్స్ వారిచే పెయింటర్లకు అవగాహన

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: సిరి ట్రేడర్స్ యజమాని ఆది లక్ష్మణ్ ఆధ్వర్యంలో జెఎస్‌డబ్ల్యూ పెయింట్స్ వారిచే ముస్తాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పెయింటర్స్‌కు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక దత్త సాయి గార్డెన్స్‌లో ఈ సదస్సు జరిగింది. జెఎస్‌డబ్ల్యు పెయింట్స్ ప్రతినిధి ప్రణీత్ మాట్లాడుతూ పెయింటర్లకు, కాంట్రాక్టర్లకు పెయింట్స్ వాడకంలో మెలుకువలను వివరించారు. కంపెనీ ద్వారా పెయింటర్లకు వచ్చే స్కీములను, వివిధ రకాల రంగుల నాణ్యతకు, మన్నిక, దీర్ఘ కాలికతకు సంబంధించిన విషయాలను గురించి చెప్పారు. వినియోగదారులతో రంగుల ఎంపిక, నాణ్యత వంటి విషయాలను ఎలా వివరించాలో తెలియజేశారు. జెఎస్‌డబ్ల్యు పెయింట్స్ ద్వారా నెల, త్రైమాసిక, వార్షిక పథకాలను తెలియజేశారు. అనంతరం సిరి ట్రేడర్స్ ప్రొప్రైటర్ ఆది లక్ష్మణ్ మాట్లాడుతూ జెఎస్‌డబ్ల్యూ పెయింట్స్ కంపెనీ పెయింటర్లకు, కాంట్రాక్టర్లకు పాయింట్స్ రూపంలో మంచి బహుమతులను పొందే అవకాశం ఉందని, పెయింటర్ తనకు రోజువారి కూలీ ద్వారానే వచ్చే డబ్బులు కాకుండా ఈ పాయింట్స్‌ను ఉపయోగించుకొని ఇంకా ఎక్కువ డబ్బులు పొందవచ్చునని, ఈ అవకాశాన్ని పెయింటర్స్ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం పెయింటర్స్‌కు గొడుగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, తాటకర్ల వేణు, అనమేని నవీన్ తదితరులున్నారు.



# అలుగు పారుతున్న కన్సాన్పల్లి పెద్ద చెరువు..

**- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామ ముదిరాజులు...**

అందోలు, ప్రజాస్ఫూర్తి : గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అందోలు మండల పరిధిలోని కన్సాన్ పల్లి పెద్ద చెరువు పూర్తిగా నిండి అలుగుపడుతుంది. దీంతో చెరువు నిండుకుండను తలపిస్తుంది. శుక్రవారం రాత్రి ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో పెద్ద ఎత్తున వరద చెరువులోకి చేరి శనివారం తెల్లవారుజామున అలుగునుండి నీరు ఉప్పొంగింది. చెరువు అలుగు పారుతున్న విషయం తెలుసుకున్న గ్రామ యువకులు, పెద్దలు, చిన్నారులు చెరువు వద్దకు చేరుకున్నారు. నిమిషం నిమిషానికి అలుగు నుండి నీటి ప్రవాహం పెరగడంతో యువకులు చిన్నారులు కేరింతల కొడుతూ సందడి చేశారు. మరికొందరు సెల్ఫీలు దిగుతూ ఉత్సాహంగా గడిపారు. చెరువులో ఉన్న చేపలు అలుగు నుండి బయటకు దూకుతున్న గ్రామం లో ప్రచారం జరుగడంతో చేపల వలలు, కట్టెలు తీసుకోని పరుగులు తీశారు. దీంతో చెరువు వద్ద జన సందోహం నెలకొంది. కొందరికి చేపలు చిక్కడంతో సంతోషం వ్యక్త చేయగా.. అందరికీ సాయంత్రం వరకు ఉన్న చేపలు దొరకకపోవడంతో నిరుత్సాహంగా వెనుదిరిగారు. మూడేళ్ల తర్వాత మళ్లీ చెరువు అలుగు పారడంపై గ్రామ మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చేపల వ్యాపారం పెరిగి మత్స్యకార సంఘానికి ఆదాయం పెరగనుందని సంబర పడుతున్నారు. ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు మొరబోయిన కృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ పెద్ద చెరువు కన్సాన్ పల్లి, గడి పెద్దాపూర్ గ్రామాల మధ్య విస్తరించి ఉండటంతో చేపలు పట్టే హక్కు ఒక్క పెద్దాపూర్ గ్రామ మత్స్యకారులకు ఉండడంతో రెండు గ్రామాల మధ్య చెరువు చేపల వివాదం 30 ఏళ్ల పాటు కొనసాగిద్దని ఇటీవల కన్సాన్ పల్లి మత్స్యకారులకు చేపల పట్టే హక్కు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని దీని ద్వారా కన్సాన్పల్లి గ్రామ ముదిరాజులు త్వరలో అధికారుల ద్వారా చెరువులో చేప పిల్లలను వదిలి చేపలు పట్టేందుకు సన్నాహాలు చేసుకుంటున్నాట్లు ఆయన తెలిపారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా శనివారం గాజులరామారం డివిజన్ వల్లభాయ్ పటేల్ నగర్ లో గల ఏవీఎం హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, విద్యార్థులు గోపికలు శ్రీకృష్ణుడి వేషధారణలో ముస్తాబయి సందడి చేశారు. అనంతరం పాఠశాలలో ఉట్టి కొట్టి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ భాషాని బాలరాజ్ మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్ట గురించి విద్యార్థులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బాసాని అనుష ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పద్ధతి మార్చుకోండి!

* **నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు:**
* **సస్పెక్ట్ షీట్స్ లో వున్నవారికి జీడిమెట్ల డిఐ హెచ్చరిక**




ప్రజా స్ఫూర్తి, జీడిమెట్ల: జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సస్పెక్ట్ షీట్స్ ఉన్న వ్యక్తులకు శనివారం పోలీస్ స్టేషన్ లో కౌన్సిలింగ్ ఇచ్చారు.కౌన్సిలింగ్ లో భాగంగా ఎవరైనా క్రిమినల్ కేసరిలో పాల్గొంటే వారిపైన కఠినమైన చర్యలు తీసుకుంటామని, వారి పైన గ్యాంగ్ ఫైల్ ఓపెన్ చేస్తామని వారిని హెచ్చరించారు. అలాగే ఎవరైతే గత కొన్ని సంవత్సరాలుగా సత్ప్రవర్తన కలిగి ఉండి ఎలాంటి కేసులలో పాల్గొనకుండా ఉన్న వ్యక్తుల యొక్క సస్పెక్ట్ షీట్లను క్లోజ్ చేస్తామని వారికి తెలిపారు. అందరూ ఎలాంటి క్రిమినల్ కేసుల్లో పాల్గొనవద్దని, పద్ధతి మార్చుకోకుండా నేరాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు వుంటాయని జీడిమెట్ల డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ కనకయ్య వారికి తమదైన శైలి లో తెలిపాడు.

## పేదోళ్ల నాయకుడు కొర్వి కృష్ణస్వామి..

- **భాగ్యనగర ఆభ్యున్నతికి ఆధ్యుడు కొర్వి కృష్ణ స్వామియే**
- **ఆయన ఆశయాలను కొనసాగిద్దాం..**
- **రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బలపడదాం..**
- **మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ ముదిరాజ్**



అందోలు, ప్రజాస్ఫూర్తి : ముదిరాజుల ముద్దుబిడ్డ, పేదోళ్ల మహానేత కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కన్సాన్ పల్లి మాజీ ఉపసర్పంచ్ ఎం.కృష్ణ ముదిరాజ్ అన్నారు.శనివారం కొరవి కృష్ణస్వామి 138 వ జయంతి పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ కొర్వి కృష్ణ స్వామి భాగ్యనగర అభివృద్ధికి అనితర సాధ్యంగా కృషి చేశాడన్నారు. స్వాతంత్ర సమరయోధుడిగా, కవిగా, జర్నలిస్టుగా, పేదోళ్ల నాయకుడిగా ప్రజల మనసు దోచుకున్నాడని తెలిపారు. హైదరాబాద్ తొలి మేయర్ గా సేవలందించిన సమయంలో మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేసి మహానగర అభివృద్ధిపై చెరగని ముద్ర వేసిన ఘనత ఆయనకే సొంతమన్నారు. ముదిరాజ్ జాతి ఐక్యత కోసం ముదిరాజ్ మహాసభ సంఘాని స్థాపించి మన జాతి అభివృద్ధి కోసం ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. ఆ మహానేత స్ఫూర్తితో మనమంతా ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. ఆయన అందించిన పోరాటస్ఫూర్తితో బహుజనులంతా రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని సమాజ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు.

# మదర్ థెరిస్సా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

* **చైర్మన్ కొలన్ శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో:**
* **నిరుపేదలకు అండగా నిలబడేలా పని చేయాలన్న కోలన్ శ్రీనివాస్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, నిజాంపేట్ :నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప మదర్ థెరిస్సా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఆ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ఎన్నుకున్నారు. కమిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా పోచారం. ప్రభాకర్ రెడ్డి, చీఫ్ సెక్రటరీగా మన్నెపల్లి. నర్సింగరావు, అధ్యక్షుడిగా సలాది. శివ, ఉపాధ్యక్షుడిగా ఎం.మూర్తి, జనరల్ సెక్రటరీగా వై.దాలినాయుడు, పితాని శ్రీనివాసరావు, కోశాధికారులుగా ఏ. శ్రీనివాసరావు, (అద్దంకి), పి. శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా ఏ. నాగభూషణం, పాల శ్రీనివాసరావు, కార్య నిర్వాహక కార్యదర్శులుగా పి. బుజ్జి నియమితులయ్యారు. ఏడాదిపాటు కొనసాగే ఈ కమిటీ పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించి నిరుపేదలకు అండగా నిలబడేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా కొలన్ శ్రీనివాస్ రెడ్డి వారికి సూచించారు. మదర్ థెరిస్సా అంటే మానవత్వానికి ప్రతీక అని, సమాజంలో మానవత్వం పరిమళించే విధంగా కమిటీ స్ఫూర్తిదాయక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఆ మాతృమూర్తి జయంతి రోజైన ఆగస్టు 26న మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఎంతోమందికి ఆరోగ్య ప్రయోజనం చేకూరుస్తున్న కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టాలని, అందుకు తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని స్పష్టం చేశారు.అనంతరం కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులకు కొలన్ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

# సమాజహితం కోసం కలాలకు, గళాలకు పదును పెట్టాలి

* **కవులు, గాయకులు.**
* **సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా కవులు గాయకుల సమ్మేళనం.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రజల గొంతుకగా స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తిని అందరికీ దక్కేలా నేటి కవులు కళాకారులు గాయకులు ప్రజలకు అండగా నిలబడాలని సిఐటియు నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవులు, గాయకులు తమ కవితలతో , గానంతో చైతన్యవంతమైన, అభ్యుదయమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 79 వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా సిఐటియు కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంచికంటి భవ న్ లో నిర్వహించిన "" స్వాతంత్ర దినోత్సవం నేటి మన కర్తవ్యం""" అనే అంశంపై గాయకులు ,కవుల సమ్మేళనాన్ని నిర్వహించడం జరిగింది. సమ్మేళనానికి సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సీనియర్ రచయిత సీరంశెట్టి కాంతారావు, ప్రజా గాయకులు కూరపాటి సమ్మయ్య, తెలుగు గజల్ రచయిత బి రాజేష్, ప్రముఖ రచయిత్రి కళ్యాణి, ప్రముఖ గాయకులు సిద్దెల రవి, కొండ జంపన్న, సుదర్శన్, దూడల బుచ్చయ్య,పాటల రచయిత గాయకులు మహమ్మద్ జలాల్, మల్లెబోయిన లింగయ్య తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్న కవులు, గాయకులు, కళాకారులు అందరు ఇన్నేళ్ల స్వాతంత్ర్యం లో ప్రజలు, కవులు, కళాకారులు, ఎదుర్కొంటున్న అనేక రకాల రుగ్మతలను ఎదిరించేలా తమ కళాలు గళాలను వినిపించారు. నేటి భారతదేశంలో అవినీతి ఆకలి అనేక రకాల రుగ్మతల మధ్య కులాలు, మతాలు సంక్షోభాలు మత విద్వేషాలు అనేక అంశాల పట్ల ప్రతి కవి రచయిత గాయకులు అందరూ ప్రజల కొండగా నిలబడేలా రచనలు గానంతో ప్రజా చైతన్యంతో ముందుకు రావాలని వారు ఆకాంక్షించారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సిఐటియు బృందానికి నాయకులకు అభినందనలు తెలియజేశారు సమాజ హితం కోసం పాటుపడే ప్రతి వ్యక్తి ప్రజా చైతన్యంతో కార్మికులు కర్షకుల కోసం కృషి చేసే విధంగా అనేక రచనలు గాయకులు చేయాలని ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం బుగ్గ వీటి సరళ, సిఐటియు జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మచారి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె సత్య, ప్రజా సంఘాల నాయకులు కొండ కొండపల్లి , శ్రీధర్ లిక్కి బాలరాజు, నందిపాటి రమేష్, నాగకృష్ణ,, సందకూరి లక్ష్మి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.




## సుంకర రవి శీవ పార్థివ దేహనికి ఎమ్మెల్యే నివాళి



ప్రజాస్ఫూర్తి ఇల్లందు: ఇల్లందు మున్సిపాలిటి 18వ వార్డు కు చెందిన సుంకర రవి శీవ ఆకస్మిక మరణం చెందగా వారి పార్థివ దేహనికి ఇల్లందు గవర్నమెంట్ హస్పిటల్నం దు ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు

## ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



జీడిమెట్ల ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ పరిధి ఎస్.ఆర్. నాయక్ నగర్ లో తాతినేని నాని, తాతినేని విహాన్మ, ఎస్.ఆర్. నాయక్ నగర్ కాలనీ సభ్యులు నిర్వహించిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీడిమెట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ గడ్డం మల్లేష్ తో పాటు బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చేరుకుపల్లి భరత్ సింహా రెడ్డి లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు ఈ కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు ఎం.ఎస్.వాసు ,ఎస్.ఆర్.నాయక్ నగర్ అధ్యక్షులు టి.టి.కె.శ్రీనివాస్ రావు , యూనిస్ ,130 సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు విజయందర్ రెడ్డి, నార్లకంటి దుర్గయ్య, పెద్దింటి సాయిలు, సత్తి బాబు,వెంకట రత్నం,విగ్నేష్,చైతన్య,గణేష్,మనోహర్,కూన మాహేష్ గౌడ్,పాపయ్య దొర,చందు, రాజేష్, రాహుల్,మహేష్,శ్యామ్,శివ తదితరులు పాల్గొన్నారు.



## పెన్షన్ల పెంపు హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి...

**- జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్ పల్లె సంజీవయ్య**

**- 24 న జోగిపేట కు మందకృష్ణ రాక...**

అందోలు, ప్రజాస్ఫూర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ల పెంపు హామీని వెంటనే అమలు చేయాలని జోగిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య అన్నారు. శనివారం జోగిపేటలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో లో చెప్పిన విధంగా పెన్షన్లు పెంచాలనే డిమాండ్ తో వచ్చే నెల 09 న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆందోల్ నియోజకవర్గంలోని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొనీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వృద్ధులు, వితంతువులకు రూ. 4000, వికలాంగులకు రూ. 6000, ఒంటరి మహిళలకు రూ. 4000 , కండరాల నరాల క్షీణత తో బాధ పడుతున్న వారికి రూ. 15000 వేల పెన్షన్ల ఇవ్వాలనీ డిమాండ్ చేశారు.ఈ నెల 24 న నిర్వహిస్తున్న వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పెన్షన్ల పెంపుకై నిర్వహిస్తున్న సన్నాహక సభకు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరు అవుతున్నారు.ఈ సమావేశంలో మాజీ జడ్పిటిసి అర్జునయ్య, సీనియర్ నాయకులు ఏర్పుల కృష్ణ, సంటెనోళ్ళ సంజీవయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మైసగల్ల బుచేంద్ర, కాకతీయ యూనివర్సిటీ నాయకుడు ఎర్రోళ్ల పోచయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు, మాజీ కౌన్సిలర్ ప్రవీణ సంతోష్ , మాజీ ఎంపిటిసి లింగయ్య ,చౌటకూర్ మండల అధ్యక్షుడు రమేష్, జిల్లా కార్యదర్శి సాయిలు, నల్లోల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




## యూరియా వేటలో రైతన్నల అగచాట్లు

వీరంతా యూరియా కోసం వేకువజాము నుంచి సహకార కేంద్రం వద్ద బారులుతీరిన రైతులు. మహబూబాబాద్ జిల్లా గూడూరులోని వ్యవసాయ సహకార కేంద్రం వద్ద శనివారం 200 మీటర్ల మేరకు బారులు తీరారు. వరినాట్లు దాదాపు పూర్తవడంతో మొదటి దఫా యూరియా వేసేందుకు అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించినా ఫలితం ఉండడం లేదని, తగినంత యూరియా అందుబాటులో ఉందని, ఎవరూ ఆందోళన చెందొద్దని స్థానిక వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ అన్నారు.

## అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

* **భారీ వర్షా లు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి:**
* **ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి :కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్**



ప్రజాస్ఫూర్తి, కూకట్పల్లి :గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆల్విన్ కాలనీ డివిజన్ ఉషాముళ్ళపూడి ప్రధాన రహదారిలో ఎల్లమ్మ చెరువు పెట్రోల్ బంక్ వద్ద మ్యాన్ హోల్స్ నుండి వరద నీరు పొంగి రోడ్డు మీద ప్రవహించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జిహెచ్ఎంసి ఇంజినీరింగ్, జలమండలి హైడ్రా అధికారులతో సమస్య వున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించాడు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువు పక్క నుండి పదరహరు ఫీట్ల డ్రైనేజి పైప్ లైన్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో డ్రైనేజీ పైప్ లైన్ డ్యామేజితో సమస్య ఏర్పడిందని అన్నారు. ఇప్పటికే ఇటాచి యంత్రంతో మరమ్మత్తు పనులు ప్రారంభించారని పేర్కొన్నాడు.ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్ల పైకి పొంగుతున్న నీటి ప్రవాహాన్ని వెంటనే నిలిపివేసి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు తెలిపాడు. ప్రధాన రహదారి కావడంతో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు చేపట్టి, వరద నీటి ప్రవాహాన్ని రోడ్డు పైకి రాకుండా నివారించాలని జిహెచ్ఎంసి సిబ్బందిని ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు కలిగినా ఎలక్ట్రికల్, రోడ్డు, డ్రైనేజీ, మంచి నీటి సమస్యలు తలెత్తినా వెంటనే సంబంధిత అధికారులకు గాని లేదా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. అదేవిధంగా వర్షాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాల పై జిహెచ్ఎంసి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని , అధికారులు, మాన్ సున్ ఎమర్జెన్సీ టీమ్స్ , డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని అధికారులకు తెలిపాడు. ఈ కార్యక్రమంలో దాతి రమేష్, ఎం.శ్రీనివాస్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, సూపర్వైజర్ శివ, హైడ్రా సిబ్బంది, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై పశువుల తిష్ట.. పెరుగుతున్న ప్రమాదాలు!

* **గాయాలపాలవుతున్న వాహనదారులు***
* **మరోవైపు ప్రాణాలు కోల్పోతున్న పశువులు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర, జాతీయ రహదారులపై పశువులు స్వేచ్ఛగా తిరుగుతున్న దృశ్యాలు రోజువారీగా కనిపిస్తున్నాయి. వీటివల్ల వాహనదారులు తీవ్ర ప్రమాదాలకు గురికావడానికి కారణమవుతోంది. ముఖ్యంగా రాష్ట్ర, జాతీయ రహదారులపై అజాగ్రతగా తిరిగే పశువులు వాహనాల దారికి అడ్డుగా నిలిచి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. కొన్ని ప్రమాదాల్లో వాహనదారులు తీవ్ర గాయాలపాలవుతుండగా, మరికొన్ని ప్రమాదాల్లో పశువులు మృత్యువాతపడుతున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని విద్యానగర్ కాలనీ, రామవరం, సూపర్‌బజార్, గణేష్ టెంపుల్ ఏరియా, పాత బస్‌డిపో, లక్ష్మీదేవిపల్లి, బస్టాండ్ తదితర ఏరియాల్లో పశువులు రోడ్డుపై అడ్డంగా తారసపడుతుంటాయి. తాజాగా కొత్తగూడెం - ఖమ్మం రాష్ట్ర రహదారి విద్యానగర్ వద్ద గుర్తుతెలియని వాహనం ఒక ఆవు దూడను ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో ఆ దూడ అక్కడికక్కడే మృతి చెందింది. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత కూడా సంబంధిత అధికారులు స్పందించకపోవడం, మృతి చెందిన ఆవుదూడను తొలగించకపోవడం పట్ల పలువురు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సకాలంలో స్పందించి రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులను బందెలదొడ్లకు తరలించాలని, రోడ్లపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. అదేవిధంగా రాత్రి సమయాల్లో రోడ్లపై సంచరించే ఆవులు కనిపించేలా వాటికి రేడియం స్టిక్కర్లు అంటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సమస్యపై సంబంధిత మున్సిపల్, పశుసంవర్ధక శాఖ, పంచాయతీరాజ్ శాఖలు వెంటనే జోక్యం చేసుకొని రహదారులపై పశువులు తిరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

* **మంచిర్యాలలో రోడ్డు ప్రమాదం.. ఆవు యజమాని అరెస్ట్***

మంచిర్యాల పట్టణంలో వాహన ప్రమాదానికి కారణమైన ఆవు యజమానిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మజారోద్దీన్ తెలిపారు. కరీంనగర్ కు చెందిన చిట్టిబాబు ఆగస్టు 8న తన కుటుంబంతో కలిసి కారులో మంచిర్యాలకు వస్తుండగా, అడ్డంగా ఉన్న ఆవును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆవును రోడ్డుపై వదిలేసిన యజమాని కార్తీక్పై బాధితుడి సోదరుడు మణిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

* **మంచిర్యాలలో జరిగినట్టు ప్రమాదం జరగకముందే అధికారులు మేలుకోండి***

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంచిర్యాలలో జరిగినట్టు ప్రమాదం జరగకముందే అధికారులు మేలుకొని రోడ్డుపై తిష్ట వేస్తున్న పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



# భారత్‌పై టారిఫ్‌లు.. మెత్తబడిన ట్రంప్.. ఆంక్షలు ఉండకపోవచ్చని సంకేతం

* రష్యా నుంచి చమురు కొనుగోలుపై భారత్‌కు ఊరట
* భారత్ ఇప్పుడు రష్యాకు కీలక ఆయిల్ క్లయింట్ కాదన్న ట్రంప్
* సెకండరీ టారిఫ్‌లు విధించకపోవచ్చని సంకేతాలు
* అమెరికా నుంచి భారీగా చమురు, గ్యాస్ కొంటున్న భారత్




**అమెరికా :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై సెకండరీ టారిఫ్‌లు విధించే విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాస్త మెత్తబడినట్లు కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌పై ఆంక్షలు విధించాల్సిన అవసరం రాకపోవచ్చని ఆయన సంకేతాలు ఇచ్చారు. రష్యా ఇప్పటికే భారత్ రూపంలో ఒక కీలకమైన ఆయిల్ క్లయింట్‌ను కోల్పోయిందని ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం. పుతిన్‌తో భేటీ కోసం అలాస్కా పర్యటనకు వెళ్తూ ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ఫాక్స్ న్యూస్‌తో ట్రంప్ మాట్లాడారు. "పుతిన్ ఒక కీలకమైన ఆయిల్ క్లయింట్‌ను కోల్పోయారు. అదే భారత్. ఆ దేశం సుమారు 40 శాతం చమురును కొనుగోలు చేసేది" అని ఆయన అన్నారు. "ఒకవేళ నేను సెకండరీ టారిఫ్‌లు విధించాల్సి వస్తే, అది వారికి చాలా నష్టం కలిగిస్తుంది. అవసరమైతే నేను ఆ పని చేస్తాను. బహుశా ఆ అవసరం రాకపోవచ్చు" అని ట్రంప్ వివరించారు. వాస్తవానికి, ఆగస్టు 27 నుంచి భారత్‌పై 25 శాతం సెకండరీ టారిఫ్‌లు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. అలాస్కాలో ట్రంప్, పుతిన్ మధ్య చర్చలు సఫలం కాకపోతే భారత్‌పై ఆంక్షలు మరింత పెరగవచ్చని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ కూడా ఈ వారం మొదట్లో హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. అమెరికా నుంచి చమురు, గ్యాస్ కొనుగోళ్లను గణనీయంగా పెంచింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ మధ్య అమెరికా నుంచి భారత్ చమురు, గ్యాస్ దిగుమతులు 51 శాతం పెరిగాయి. అలాగే, 202425 ఆర్థిక సంవత్సరంలో అమెరికా నుంచి ఎల్‌ఎన్‌జీ దిగుమతులు 2.46 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది గతేడాది 1.41 బిలియన్ డాలర్లుగా ఉంది. అమెరికాతో వాణిజ్య లోటును తగ్గించడం ట్రంప్ ప్రభుత్వ ముఖ్య లక్ష్యాల్లో ఒకటి కావడంతో భారత్ చర్యలు సానుకూల ప్రభావం చూపుతున్నట్లు కనిపిస్తోంది. ఈ ఆంక్షల ప్రతిపాదన అన్యాయమని భారత ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. తమ దేశ ఆర్థిక భద్రత, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పింది. అమెరికాతో వాణిజ్య లోటును తగ్గించేందుకు 2025 నాటికి ఇంధన దిగుమతులను 25 బిలియన్ డాలర్లకు పెంచుతామని ప్రధాని నరేంద్ర మోదీ గత ఫిబ్రవరిలోనే హామీ ఇచ్చారు. రష్యాపై ఆధారపడటాన్ని తగ్గించుకుంటూ, ఇంధన వనరులను వైవిధ్యపరుస్తున్నామని న్యూఢిల్లీ స్పష్టం చేసింది.



## భద్రాచలం వద్ద 29.6 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం

**భద్రాచలం :** తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటి వల్ల భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శనివారం సాయంత్రం గోదావరి నీటిమట్టం 29.6 అడుగులు దాటి ప్రవహిస్తోంది. రెండు రోజుల క్రితం 16 అడుగుల మేర ఉన్న గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతూ 29 అడుగులు దాటింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటి వల్ల భద్రాచలం వద్ద ఇంకా నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో నదిలో స్నానాలు ఆచరించే భక్తులు నది లోపలికి వెళ్లకుండా ఒడ్డునే ఉండి స్థానాలు ఆచరించాలని ఆదేశాలు జారీ చేశారు. నది వద్ద లాంచీలు, పడవలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

## 'ఓట్ల చోరీ' ఆరోపణలు.. చెక్ పెట్టేందుకు సిద్ధమైన ఈసీ?

**ఢిల్లీ :** కర్ణాటక, బిహార్ సహా దేశంలో అనేక చోట్ల ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా విపక్ష నేతలు ఎన్నికల సంఘాన్ని (EC) లక్ష్యంగా చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విమర్శలకు చెక్ పెట్టేందుకు ఈసీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఓట్ల చోరీ ఆరోపణల వేళ.. ఈ నెల 17న మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. బిహార్‌లో రాహుల్ గాంధీ 'ఓటు అధికార యాత్ర'ను ప్రారంభించనున్న రోజే ఈ సమావేశం ఏర్పాటుకు ముందుకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే సమయంలో తప్ప.. ఇతర అంశాలపై ఎన్నికల సంఘం అధికారికంగా విలేకరుల సమావేశం నిర్వహించడం చాలా అరుదు.




ఆదివారం నిర్వహించనున్న ప్రెస్ కాన్ఫరెన్స్ వెనుక అసలు కారణాన్ని వెల్లడించనప్పటికీ.. కొంతకాలంగా ఈసీపై వెల్లువెత్తుతున్న ఆరోపణలకు సంబంధించినదని అధికారులు తెలిపారు. ప్రతిపక్షాలు 'ఓటు చోరీ' అనే పదాన్ని పదే పదే వినియోగించడాన్ని ఈసీ ఇప్పటికే తప్పుపట్టింది. తప్పుడు కథనాలకు కారణమయ్యే ప్రచారాన్ని చేసే బదులు ఆధారాలు చూపించాలని పేర్కొంది. బిహార్‌లో ఓట్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓట్ల చోరీపై ప్రతిపక్షాలు కొంతకాలంగా పెద్దఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర, హరియాణాల్లో ఓట్లు చోరీకి గురయ్యాయని రాహుల్ గాంధీ ఇటీవల ఆరోపించారు. కర్ణాటకలోని ఒక్క మహాదేవపుర నియోజకవర్గంలోనే లక్ష ఓట్ల చోరీ జరిగిందన్నారు. ఈ ఆరోపణలకు లిఖితపూర్వంగా డిక్లరేషన్ ఇవ్వాలని ఎన్నికల సంఘం కోరింది. లేనిపక్షంలో దేశానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ పరిణామాల నడుమే కీలక సమావేశానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది.



## మాదాపూర్‌లో ఉమెన్స్ హాస్టల్ నిర్వాహకుడిపై మహిళల దాడి

**హైదరాబాద్ :** మాదాపూర్‌లో ఉమెన్స్ హాస్టల్ నిర్వాహకుడిపై మహిళలు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. మాదాపూర్ ఇమేజ్ గార్డెన్ రోడ్డులో అర్ణవ్ ప్లాజాలో ఉన్న ఎన్‌పీపీ ఎగ్జిక్యూటివ్ ఉమెన్స్ హాస్టల్‌లో 16 ఏళ్ల బాలిక ఉంటోంది. బాలికపై హాస్టల్ నిర్వాహకుడు సత్య ప్రకాష్ లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ కొందరు మహిళలు ఆందోళనకు దిగారు. పూలకుండీలను ధ్వంసం చేసిన మహిళలు, సత్యప్రకాష్‌పై దాడికి దిగారు. హాస్టల్‌లో గొడవ జరుగుతోందని డయల్ 100కు సమాచారం రావడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితి అదుపు చేశారు. దాడికి పాల్పడిన మహిళలతో పాటు, సత్య ప్రకాష్‌ను మాదాపూర్ పీఎస్‌కు తరలించారు. మైనర్ బాలికపై లైంగిక దాడి జరగలేదని, కావాలనే పథకం ప్రకారం తనపై దాడి చేశారని సత్య ప్రకాష్ ఆరోపించారు.

## ప్రాణనష్టం జరగకుండా ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలి

**హైదరాబాద్ :** తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆర్అండ్‌బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. అధిక వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, వంతెనల వివరాలపై ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు కల్వర్టులు, లో లెవెల్ వంతెనలు, కాజ్ వేల వద్ద ఇంజినీర్లు విధిగా తరచూ క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలన్నారు. ప్రాణనష్టం జరగకుండా ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. అందుకు పోలీస్, విద్యుత్, రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీ రాజ్ శాఖల విభాగాలతో ఆర్ అండ్ బీ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రజా రవాణాకు ఎక్కడా ఇబ్బంది లేకుండా తెగిన రోడ్లు, కల్వర్టులు వద్ద తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. అధికారులు జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని, క్షేత్ర స్థాయి పరిస్థితులు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు.



## అత్యవసర పరిస్థితులా: ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్

**హైదరాబాద్ :** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు వేగవంతమైన సహాయాన్ని అందించేందుకు పంచాయతీ రాజ్ శాఖ అన్ని ఏర్పాట్లు చేపట్టింది. ఇందుకోసం రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర స్థాయిలో, ఈఎన్సీ (ఇంజినీరింగ్ ఇన్ చీఫ్) కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక ఫ్లడ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. రహదారి సమస్యలు లేదా ఇంజినీరింగ్ సమస్యలు తలెత్తినా, ఫిర్యాదు చేయడానికి ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 0403517 4352కు కాల్ చేయవచ్చు. ఈ కంట్రోల్ రూమ్ ద్వారా సమాచార సేకరణ, స్పందన, పునరుద్ధరణ చర్యలపై సమన్వయం జరుగుతుంది. అలాగే ప్రతి సర్కిల్ స్థాయిలో ప్రత్యేకంగా ఫ్లడ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్‌తో పాటు, ప్రతి సర్కిల్ స్థాయిలోనూ సూపరింటెండింగ్ ఇంజినీర్లు (ఎస్ఈలు), ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఈఈలు) ఉన్న కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. దీనివల్ల ఫీల్డ్ స్థాయిలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా, స్థానిక అధికారులు వెంటనే స్పందించి అవసరమైన సహాయాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కంట్రోల్ రూముల ద్వారా సమాచార సేకరణ, స్పందన, పునరుద్ధరణ చర్యలపై సమన్వయం జరుగుతోంది. వర్షాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా రోడ్లు దెబ్బతిన్నా, కల్వర్టులు కూలినా, లేదా గండ్లు పడ్డా వెంటనే సంబంధిత నంబర్లకు సమాచారం అందించాలని పంచాయతీ రాజ్ శాఖ కోరింది. వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల్లోని అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు.



### రాజగోపాల్ రెడ్డి వ్యవహారం
## క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుంది



**హైదరాబాద్ :** బీసీ రిజర్వేషన్ల విషయంలో వెనక్కి తగ్గేది లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తేల్చి చెప్పారు. ఈ అంశంపై త్వరలోనే స్పష్టత వస్తుందన్నారు. మార్వాడీలు మనలో ఒకరు.. వారిని వెళ్లగొట్టే హక్కు ఎవరికీ లేదన్నారు. రాజగోపాల్ రెడ్డి ఏ ఉద్దేశంతో అన్నారో తెలుసుకుంటామని చెప్పారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం పరిశీలించాలని క్రమశిక్షణ కమిటీని ఆదేశించామన్నారు. ఆయన వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుందని తెలిపారు.

## వరంగల్ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటాం : మంత్రి కొండా సురేఖ

**వరంగల్ :** వరంగల్ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటామని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. హన్మకొండ రాంనగర్ లోని తమ నివాసంలో శనివారం ప్రజల నుంచి వినతులను విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రజల సమస్యలను సావధానంగా వింటూ అప్పటికప్పుడే సంబంధిత శాఖ అధికారులతో మంత్రి మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ప్రజలు ఏ సమస్య ఉన్న ఎవరి వద్దకు వెళ్లి పైరవీలు చేయాల్సిన అవసరం లేదని, నిరభ్యంతరంగా తనను సంప్రదించవచ్చన్నారు. తమది పేదల ప్రభుత్వమని పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని ఆమె అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు సమాన



న్యాయం చేయడమే మా లక్ష్యం అని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు భారీ వర్ష సూచన కారణంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలాంటి ఆపద సమయంలోనైనా కొండా దంపతుల ఇంటి తలుపులు ఎల్లవేళలా తెరిచే ఉంటాయని, కొండా దంపతులు కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటారని, కార్యకర్తలను, నాయకులను కొండా దంపతులు కంటికి రెప్పలా కాపాడుకొని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటారన్నారు.

# దేశ విభజనపై ఎన్‌సీఈఆర్‌టీ పాఠం..విమర్శించిన కాంగ్రెస్

దేశ విభజన సమయంలోని భయానక పరిస్థితులను వివరిస్తూ..నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ విద్యార్థుల కోసం ఓ ప్రత్యేక మాడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందులో 1947లో జరిగిన దేశ విభజనకు ఒక వ్యక్తి మాత్రమే కారణం కాదని..ఇందులో ముగ్గురి పాత్ర ఉందని పేర్కొంది. విభజనకు పట్టుబట్టిన ముస్లిం లీగ్ అగ్రనేత మహమ్మద్ అలీజిన్నా, దానికి అంగీకరించిన కాంగ్రెస్, అమలు చేసిన లార్డ్ లూయిస్ మౌంట్ బాటన్ అని తెలిపింది. ఈ విభజన వల్లే భారత్‌కు కశ్మీర్ సమస్యగా మారిందని..నాటి నుంచి కశ్మీర్‌ను పాక్ మార్గంగా చేసుకొని దేశంపై పలు ఒత్తిడులను తీసుకురావడానికి ఉపయోగించుకుంటోందని ఆరోపించింది. 1947లో జరిగిన భారత్ పాకిస్థాన్ విభజన సమయంలో ప్రజల బాధ, బాధితుల వేదనలను గుర్తు చేసుకుంటూ ఏటా ఆగస్టు 14న కేంద్ర ప్రభుత్వం నిర్వహించే 'విభజన గాయాల స్మారక దినం' గురించి ప్రస్తావించారు.

**విమర్శించిన కాంగ్రెస్**

అయితే చరిత్రలో జరిగిన అసలు విషయాలు తెలియజేయకుండా వక్రీకరించారని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా ఆరోపించారు. దేశంలోని లౌకికవాదాన్ని నిర్మూలించాలని చూస్తున్న ఆర్ఎస్ఎస్ ఈ దేశానికి చాలా ప్రమాదకరమని అన్నారు.కాగా గతేడాది తొమ్మిది నుంచి 12వ తరగతులకు సంబంధించిన సిలబస్‌లో అనేక అంశాలను ఎన్‌సీఈఆర్‌టీ తొలగించిన విషయం తెలిసిందే. ఈ చర్యలను అప్పట్లో కాంగ్రెస్ వ్యతిరేకించింది. విద్యార్థులకు అసలైన చరిత్ర గురించి చెప్పకుండా..సిలబస్‌ను కాషాయీకరణ చేస్తున్నారంటూ ఆరోపించింది.




# రన్‌వేను తాకిన విమానం తోక భాగం.. తప్పిన ప్రమాదం




ముంబయి విమానాశ్రయంలో ఇండిగో విమానానికి ప్రమాదం తప్పింది. ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేసే ప్రయత్నంలో విమానం తోక భాగం రన్‌వేను తాకింది. అయితే, మళ్లీ గాల్లోకి లేచిన విమానం.. రెండోసారి సురక్షితంగా ల్యాండ్ కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇండిగో విమానయానసంస్థ ఈ ఘటనను ధ్రువీకరించింది. "ఇండిగో ఎయిర్‌బస్ ఏ321 విమానం ముంబయి విమానాశ్రయంలో దిగేందుకు సిద్ధమైంది. అయితే.. ప్రతికూల వాతావరణం కారణంగా ల్యాండ్ చేసే పరిస్థితి లేకపోవడంతో.. రన్‌వేపై తక్కువ ఎత్తులో ఉన్నప్పుడు పైలట్ దాన్ని మళ్లీ గాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే విమానం తోక భాగం రన్‌వేను తాకింది. రెండో ప్రయత్నంలో సురక్షితంగా దిగింది" అని ఇండిగో ప్రతినిధి తెలిపారు. అయితే, విమానం ఎక్కడినుంచి వచ్చింది?, ఎంతమంది ప్రయాణికులు ఉన్నారనే విషయాన్ని వెల్లడించలేదు. ప్రయాణికులు, సిబ్బంది, విమాన భద్రత తమ ప్రాధాన్యమని ఇండిగో సంస్థ తెలిపింది. దీని కోసం అన్ని సేఫ్టీ ప్రొటోకాల్స్ పాటిస్తున్నట్లు వెల్లడించింది. ఆ విమానానికి అవసరమైన తనిఖీలు, మరమ్మతులు చేపడతామని, సంబంధిత క్లియరెన్సుల వచ్చిన అనంతరమే కార్యకలాపాలను పునఃప్రారంభిస్తామని తెలిపింది.

# కోర్టు హాలులో 'చేతబడి' చేష్టలు?.. అసలేం జరిగిందంటే!

దిల్లీలోని ఓ కోర్టులో ఇటీవల ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఓ కేసు విచారణలో భాగంగా న్యాయస్థానంలో హాజరైన నిందితుడు కోర్టు హాలులో 'బియ్యం' విసరడం ఆశ్చర్యానికి గురిచేసింది. అతడి చేష్టలను చేతబడిగా అనుమానించిన న్యాయవాదులు.. న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో కొద్దిసేపు కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఈ చర్యలను తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి, నిందితుడికి శిక్షతోపాటు జరిమానా కూడా విధించారు. ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్న డాక్టర్ చందర్ విభాస్‌ను దిల్లీలోని అడిషనల్ సెషన్స్ కోర్టులో ఆగస్టు 11న హాజరుపరిచారు. ఆ సమయంలో నిందితుడు కోర్టు హాలులో ఉద్దేశపూర్వకంగా బియ్యం చల్లుతున్నట్లు న్యాయవాదులు గుర్తించారు. గత విచారణ సమయంలోనూ ఇదే విధంగా ప్రవర్తించాడని



న్యాయమూర్తి షెఫాలీ బర్నాలా టాండన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిని చేతబడిగా అనుమానిస్తూ వాటిని తొలగించే ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ చర్యలను తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి.. నేలపై విసిరిన బియ్యాన్ని సేకరించాలని నిందితుడిని ఆదేశించారు. దీంతోపాటు కోర్టు హాలును శుభ్రం చేసేందుకు స్వీపర్‌ను పిలిపించారు. ఓ పది నిమిషాల తర్వాత స్వీపర్ వచ్చి వాటన్నింటినీ తొలగించారు. ఆ సమయంలో వర్చువల్‌గా వాదనలు వినిపిస్తున్న నిందితుడి తరఫు న్యాయవాది.. అనుమతి తీసుకొని వెంటనే కోర్టుకు హాజరయ్యారు. అంతలోపే నిందితుడు తాను తప్పు చేశానని న్యాయమూర్తిని క్షమాపణ కోరాడు. మధ్యాహ్నం విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. నిందితుడి ప్రవర్తనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూఢనమ్మకాలు నిర్మూలనపై ప్రభుత్వాలు అవగాహన కల్పిస్తుంటే.. వృత్తిరీత్యా సర్జన్ అయిన డాక్టర్ చందర్ విభాస్ ప్రవర్తన ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. అతడు క్షమాపణ చెప్పడాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, మళ్లీ ఇటువంటి చర్యలు చేయడని నిందితుడి తరఫు న్యాయవాది హామీ ఇచ్చారు. దీంతో న్యాయమూర్తి ఈ కేసులో ఒకరోజు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధించారు.

# ట్రంప్ పుతిన్ ప్రయత్నాలు భేష్..: భారత్

ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే ప్రయత్నాల్లో భాగంగా అలాస్కా వేదికగా అమెరికా, రష్యా అధ్యక్షుల మధ్య జరిగిన సమావేశాన్ని భారత్ స్వాగతించింది. ఈ భేటీలో భాగంగా సాధించిన పురోగతిని అభినందిస్తున్నట్లు పేర్కొంది. భారత విదేశాంగశాఖ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. "అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్‌ల మధ్య అలాస్కాలో జరిగిన సమావేశాన్ని స్వాగతిస్తున్నాం. శాంతి సాధన దిశగా వారి ప్రయత్నాలు ఎంతో ప్రశంసనీయం. ఈ భేటీలో సాధించిన పురోగతిని అభినందిస్తున్నాం. చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే సమస్య పరిష్కారానికి ముందుకెళ్లాలి. ఉక్రెయిన్ సంక్షోభానికి వీలైనంత త్వరగా తెరపడాలని ప్రపంచం కోరుకుంటోంది" అని విదేశాంగశాఖ తన ప్రకటనలో పేర్కొంది. ట్రంప్, పుతిన్‌లు భేటీ అయ్యేందుకు ముందుకు రావడాన్ని కూడా భారత్ ఇటీవల స్వాగతించిన



విషయం తెలిసిందే. "ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు పలికేందుకు ఇదో అవకాశంగా భావిస్తున్నాం. ఇది యుద్ధాల కాలం కాదన్న ప్రధాని నరేంద్ర మోదీ సందేశానికి ఈ ప్రయత్నాలు దోహదం చేస్తాయి" అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# రాష్ట్రపతికి కోర్టు గడువు విధించవచ్చా..? కేంద్రం ఎలా స్పందించిందంటే..!

శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా ఆమోదించాలంటూ కోర్టులు వారిని నిర్దేశించవచ్చా అనే అంశంపై అభిప్రాయాలు తెలియజేయాలని ఇటీవల సుప్రీం కోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి పంపిన లిఖిత పూర్వక వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. అందులో రాష్ట్రపతి, గవర్నర్‌ల ఆమోదానికి గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కొన్ని విషయాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే రాజ్యాంగపరంగా గందరగోళం తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. బిల్లులపై గవర్నర్లు అంగీకారం తెలిపే విషయంలో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ.. గడువు విధించడం వల్ల రాష్ట్రపతి, గవర్నర్ల అత్యున్నత స్థానాన్ని తగ్గించినట్లు అవుతుందని కేంద్రం తెలిపింది. ఆ రెండు స్థానాలు ప్రజాస్వామ్య పాలనకు సంబంధించిన ఉన్నత ఆదర్శాలను సూచిస్తాయని పేర్కొంది. వారి విధుల్లో ఏవైనా లోపాలు ఉంటే అనవసరమైన న్యాయ జోక్యాల ద్వారా కాకుండా రాజ్యాంగపరమైన యంత్రాంగాల ద్వారా సరిదిద్దాలని సూచించింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి/గవర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టంచేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జె.బి.పార్దీవాలా,



జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించడంపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందిస్తూ.. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. అనంతరం దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గడువు విధింపుపై అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది.

# భారత్‌కు శుభాంశు శుక్లా.. మోదీతో భేటీ అయ్యే అవకాశం..!

యాక్సియం4 మిషన్‌తో భారత రోదసి చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు వ్యోమగామి శుభాంశు శుక్లా. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన భారత్‌కు పయనమయ్యారు. రాగానే ప్రధాని మోదీతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. యాక్సియం 4 మిషన్ విజయవంతం తర్వాత తొలిసారి భారత్‌కు వస్తున్నానంటూ శుక్లా పోస్టు ద్వారా తెలిపారు. స్వదేశానికి తిరిగి వచ్చేందుకు విమానంలో కూర్చున్నప్పుడు భావోద్వేగానికి గురైనట్లు తెలిపారు. మిషన్ కోసం గతేడాది నుంచి తన స్నేహితులు, కుటుంబసభ్యులకు దూరంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇది తనను ఎంతో బాధించిందన్నారు. వారిని కలిసి తన అనుభవాలను పంచుకునేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను విమానంలో కూర్చొన్న ఫొటోను పంచుకున్నారు. ఆదివారం భారత్‌కు రానున్న శుక్లా.. సోమవారం మోదీతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు





తెలిపాయి. ఈనెల 23న జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవంలో కూడా శుక్లా పాల్గొంటారని వెల్లడించాయి. ఇటీవల నిర్వహించిన యాక్సియం 4 మిషన్ ప్రయోగం విజయవంతమైంది. రోదసిలో 18 రోజులు గడిపి మానవాళికి ప్రయోజనం కలిగించే పలు ప్రయోగాలను నిర్వహించిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా బృందం జులై 15న భూమికి తిరిగి వచ్చింది. వచ్చిన వెంటనే వ్యోమగాములను క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ (పోలండ్), టిబర్ కపు ఈ బృందంలో ఉన్నారు.

# రష్యా పరిశ్రమలో అగ్ని ప్రమాదం..11మంది మృతి, 130మందికి గాయాలు

రష్యాలోని షిలోవ్‌స్కీ జిల్లాలోని రియాజాన్ ప్రాంతం ఎలాస్టిక్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 11 మంది మృతిచెందగా, 130 మందికి గాయాలైనట్లు రష్యా అధికారులు వెల్లడించారు. రష్యా రాజధాని మాస్కోకు ఆగ్నేయంగా 250 కిలోమీటర్ల దూరంలోని షిలోవ్‌స్కీ జిల్లాలో రియాజాన్ ప్రాంతంలో ఉన్న ఎలాస్టిక్ ప్లాంట్‌లో శుక్రవారం మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన అత్యవసర సిబ్బంది సహాయచర్యలు చేపట్టాయి. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా వెల్లడించలేదు. రష్యన్ వార్తా సంస్థ ఆర్ఐఏ తెలిపిన ప్రకారం.. ఎలాస్టిక్ ప్లాంట్‌లోని గన్ పౌడర్ వర్క్‌షాప్‌లో పేలుడు సంభవించినట్లు పేర్కొంది. పరిశ్రమలో మంటలు చెలరేగడానికి



కారణాలు స్పష్టంగా తెలియరాలేదని, దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం జరగడం నాలుగేళ్లలో ఇది రెండోసారి కావడం గమనార్హం. 2021 అక్టోబర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 17 మంది కార్మికులు మృతిచెందారని ఆర్ఐఏ పేర్కొంది.

# 'ఎయిర్ కెనడా' సిబ్బంది సమ్మె.. 700 సర్వీసులపై ప్రభావం!

వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఫ్లైట్ అటెండెంట్ల సమ్మె నేపథ్యంలో ఎయిర్ కెనడా కీలక నిర్ణయం తీసుకుంది. సమ్మె నోటీసు గడువు నేటితో ముగియడంతో.. ఎయిర్ కెనడా, అనుబంధ సంస్థ ఎయిర్ కెనడా రూజ్ కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. థర్డ్ పార్టీ నిర్వహిస్తున్న ఎయిర్ కెనడా ఎక్స్‌ప్రెస్ సేవలు మాత్రం కొనసాగుతాయని తెలిపింది. తాజా పరిణామంతో రోజుకు 1.3 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడనుంది. కెనడాలో అతిపెద్ద విమానయాన సంస్థగా ఉన్న ఎయిర్ కెనడా నిత్యం 700 సర్వీసులు నడిపిస్తోంది. ఇందులో 10 వేల మంది ఫ్లైట్ అటెండెంట్లు పనిచేస్తున్నారు. విమాన ప్రయాణ సమయంలో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు వీరిదే బాధ్యత. అయితే, వేతనాల పెంపునకు సంబంధించి కెనడియన్ యూనియన్ ఆఫ్ పబ్లిక్ ఎంప్లాయిస్ (CUPE) ఆగస్టు 13న మూడు రోజుల సమ్మె నోటీసులు ఇచ్చింది. నేటితో ఆ గడువు ముగియగా.. ఇప్పటికీ ఒప్పందం కుదరకపోవడంతో సమ్మె ప్రారంభమైనట్లు ఉద్యోగ సంఘం వెల్లడించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా సేవలందించే దాదాపు 700 ఎయిర్ కెనడా విమానాలు గ్రౌండ్‌కే పరిమితమయ్యాయి. సమ్మె నేపథ్యంలో సర్వీసులను క్రమంగా రద్దు చేస్తున్నామని, శనివారం నాటికి పూర్తిగా నిలిపివేస్తామని ఎయిర్ కెనడా ముందస్తుగానే ప్రకటించింది. ఈ క్రమంలోనే నేడు అన్ని సర్వీసులను నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. విమానాల నిలిపివేత విదేశీ ప్రయాణాలపై అధికంగా ప్రభావం చూపనుంది.

# పాకిస్థాన్‌లో వరదలు.. రెండు రోజుల్లో 320 మంది మృతి

పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ల్లోని పలు ప్రాంతాల్లో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆకస్మిక వరదల కారణంగా రెండు రోజుల్లోనే 321 మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోనే 307 మంది చనిపోయినట్లు ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగం పేర్కొంది. ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని లోయర్ దిర్, బజౌర్, అబోటాబాద్, జబ్రారీతో సహా పలు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో భారీ విధ్వంసం చోటుచేసుకుంది. వరదల కారణంగా పదుల సంఖ్యలో భవనాలు, పాఠశాలలు దెబ్బతిన్నాయి. పలు వంతెనలు కూడా కొట్టుకుపోయాయి. అనేక రహదారులు జలదిగ్బంధమయ్యాయి. వరదల్లో అనేక మంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. వీరికోసం ముమ్మర గాలింపు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు దాదాపు 2వేల మందితో ఆపరేషన్ కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

# గృహ రుణ గ్రహీతలకు ఎస్‌బీఐ ఝలక్..

వడ్డీ రేట్లు పెంపు

ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించినా వడ్డీ రేట్లు పెంచిన ఎస్‌బీఐ

కొత్తగా గృహ రుణం తీసుకునేవారిపై 25 బేసిస్ పాయింట్ల భారం

7.50 శాతం నుంచి 8.70 శాతం శ్రేణికి చేరిన కొత్త వడ్డీ రేట్లు

తక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్నవారిపై ప్రభావం అధికం

ఎస్‌బీఐ బాటలోనే ఇతర ప్రభుత్వ బ్యాంకులు నడిచే అవకాశం




**న్యూఢిల్లీ:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును తగ్గించి ప్రజలకు ఊరట కల్పించాలని భావిస్తే, దేశంలోనే అతిపెద్ద రుణదాత అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మాత్రం గృహ రుణ గ్రహీతలకు షాక్ ఇచ్చింది. కొత్తగా రుణాలు తీసుకునేవారికి వర్తించే వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల (0.25%) వరకు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది.

ఎస్‌బీఐ తాజా నిర్ణయంతో గృహ రుణాల వడ్డీ రేట్ల శ్రేణి 7.50% - 8.45% నుంచి 7.50% - 8.70%కి మారింది. వడ్డీ రేటు కనీస పరిమితిలో మార్పు లేనప్పటికీ, గరిష్ఠ పరిమితిని పెంచారు. ఈ మార్పు ప్రభావం ముఖ్యంగా తక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్న కస్టమర్లపై అధికంగా పడనుంది. వారు ఇప్పుడు మరింత ఎక్కువ వడ్డీ చెల్లించాల్సి వస్తుంది.

ప్రజలపై రుణ భారాన్ని తగ్గించే ఉద్దేశంతో ఆర్‌బీఐ వరుసగా మూడుసార్లు రెపో రేటును 5.5 శాతానికి తగ్గించింది. సాధారణంగా రెపో రేటు తగ్గితే ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేట్ (ఈబీఎల్ఆర్)తో అనుసంధానమైన రుణాలు చౌకగా మారాలి. దేశంలోని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు ఇచ్చే రుణాలలో దాదాపు 60 శాతం ఈబీఎల్ఆర్ ఆధారితమైనవే. రెపో రేటు తగ్గింపుతో రుణాలు చౌకగా మారతాయని గతంలో ఎస్‌బీఐ రీసెర్చ్ విభాగమే ఒక నివేదికలో పేర్కొనడం గమనార్హం. ప్రస్తుతం యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వంటి ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులు 7.35% నుంచి 10.10% మధ్య వడ్డీ రేట్లను అందిస్తున్నాయి. ఇప్పుడు ఎస్‌బీఐ తీసుకున్న నిర్ణయంతో మిగిలిన బ్యాంకులు కూడా వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. వడ్డీ రేట్లు తగ్గించడం రుణ గ్రహీతలకు ప్రయోజనకరమే అయినా, బ్యాంకుల లాభాల మార్జిన్లపై ఒత్తిడి కొనసాగుతోందని ఎస్‌బీఐ వర్గాలు అంతర్గతంగా హెచ్చరించాయి. ఈ ఒత్తిడే తాజా పెంపునకు కారణంగా తెలుస్తోంది.

## జీఎస్టీ ఎఫెక్ట్‌తో దీపావళి నుంచి తగ్గనున్న వస్తువుల ధరలు!




**న్యూఢిల్లీ:** దీపావళికి డబుల్ బొనంజా ఇవ్వనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో వెల్లడించిన విషయం తెలిసిందే. జీఎస్టీలో మార్పులు చేయడం ద్వారా సామాన్యులకు, చిన్న, మధ్య తరగతి వ్యాపారులకు భారీగా ఉపశమనం కల్పించనున్నట్లు మోదీ తెలిపారు. కేంద్రం తాజాగా జీఎస్టీలో రెండు శ్లాబుల విధానాన్ని ప్రతిపాదించింది. ఈ విధానంలో వస్తుసేవలను రెండు శ్లాబులుగా విభజించి 5 శాతం, 18 శాతం పన్నులు వసూలు చేయనున్నారు. ప్రస్తుతం 12% శ్లాబ్‌లో ఉన్న 99% వస్తువులు.. 5% పన్ను శ్రేణిలోకి, ప్రస్తుతం 28% పన్ను శ్లాబులో ఉన్న వస్తు సేవల్లో 90%.. 18% పన్ను రేటుకు మారనున్నాయి. దీంతో వస్తుసేవల ధరలు తగ్గుతాయి.

టూత్ పేస్ట్, టూత్ పౌడర్, హెయిర్ ఆయిల్, సబ్బులు, లిక్విడ్ సోప్స్, గొడుగులు, కుట్టు మెషీన్లు, ప్రాసెస్డ్ ఫుడ్, కండెన్స్‌డ్ మిల్క్, శీతలీకరించిన కూరగాయల వంటి ప్యాకేజ్డ్ ఫుడ్స్, ప్రెజర్ కుక్కర్లు, వాటర్ ఫిల్టర్లు, ప్యూరిఫయర్లు(నాన్ ఎలక్ట్రానిక్) ఎలక్ట్రానిక్ ఐరన్స్, కంప్యూటర్లు, గీజర్లు, వాక్యూమ్ క్లీనర్లు (నాన్ కమర్షియల్), రెడిమేడ్ దుస్తులు, రూ.500-1000లోపు ఉన్న చెప్పులు, షూస్, పలు రకాల వ్యాక్సిన్లు, డయాగ్నోస్టిక్ కిట్లు, కొన్ని రకాల ఆయుర్వేద ఔషధాలు, జామెట్రీ బాక్సులు, మ్యాప్‌లు, గ్లోబ్‌లు, సోలార్ వాటర్ హీటర్లు, అల్యూమినియం, స్టీల్ వంటపాత్రలు, నాన్ కిరోసిన్ స్టవ్‌లు, సైకిళ్లు, ప్రజా రవాణా వాహనాలు, వ్యవసాయ పరికరాలు, వెండింగ్ మెషీన్లు, గ్లేజ్డ్ టైల్స్ (లగ్జరీ కానీ వేరియంట్లు), సిమెంట్, రెడీ మిక్స్ కాంక్రీట్, ఏసీ, టీవీ, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు, కార్లు, మోటార్ సైకిల్ సీట్లు, సైకిళ్లు, వ్యవసాయ వాహనాలకు వాడే రబ్బర్ టైర్లు, ప్లాస్టర్, ప్రొటీన్ సప్లిమెంట్లు, షుగర్ సిరప్‌లు, అరోమా కాఫీ, కాఫీ ఉత్పత్తులు, టాంపర్డ్ గ్లాస్, అల్యూమినియం ఫాయిల్, రేజర్లు, ప్రింటర్లు, మ్యానిక్యూర్/పెడిక్యూర్ కిట్లు, బీమా ప్రీమియం తగ్గనున్నాయి. ఇక, సేవల రంగంపై 18 శాతం జీఎస్టీ విధించే అవకాశం ఉంది.

## ఫాస్టాగ్ వార్షిక పాస్.. తొలిరోజు 1.4 లక్షల మంది కొనుగోలు




**న్యూఢిల్లీ:** స్వాతంత్ర్య దినోత్సవం నుంచి దేశంలో ఫాస్టాగ్ టోల్ చెల్లింపు విధానంలో పెనుమార్పులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తరచూ ప్రయాణించే వారికి మరింత సులభ, చౌక హైవే ప్రయాణాన్ని కల్పించేందుకు కొత్తగా ఫాస్టాగ్ వార్షిక పాసును నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్ల కోసం ప్రవేశపెట్టిన రూ.3,000 వార్షిక హైవే టోల్ పాసు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలలోని సుమారు 1,150 టోల్ ప్లాజాల్లో వార్షిక పాస్ సౌకర్యాన్ని ఎన్‌హెచ్‌ఏఐ విజయవంతంగా అమలు చేసింది. తొలి రోజు సాయంత్రం 7 గంటల వరకు దాదాపు 1.4 లక్షల మంది వినియోగదారులు వార్షిక పాస్‌ను కొనుగోలు చేసి యాక్టివేట్ చేసుకున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ వెల్లడించింది. అదేవిధంగా టోల్ ప్లాజాల్లో దాదాపు 1.39 లక్షల లావాదేవీలు నమోదైనట్లు తెలిపింది. ఈ వార్షిక పాస్ తీసుకున్న వినియోగదారులు ఎస్ఎంఎస్ ద్వారా జీరో టోల్ మెసేజ్ అందుకుంటున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ వివరించింది. ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్లకు మాత్రమే ఈ వార్షిక ఫాస్టాగ్ పాస్ వర్తిస్తుంది. ఎన్‌హెచ్‌ఏఐ నిర్వహించే జాతీయ హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలపైన టోల్ చార్జీలు చెల్లించేందుకు ఒకేసారి డబ్బు చెల్లించి ఫాస్టాగ్ వార్షిక పాసును తీసుకోవచ్చు. ఈ పథకం కింద వాహన యజమానులు ఒకేసారి రూ. 3,000 చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిపాటు ఎన్‌హెచ్‌ఏఐ నిర్దేశించిన జాతీయ రహదారుల్లో 200 వరకు టోల్ ప్లాజాలను దాటవచ్చు.

# ప్రాబబుల్స్‌లో ఛెత్రీకి నో ఛాన్స్..



### మళ్లీ వీడ్కోలు పలికేనా..?

**న్యూఢిల్లీ:** భారత ఫుట్‌బాల్ లెజెండ్ సునీల్ ఛెత్రీకి బిగ్ షాక్. జట్టుకోసం వీడ్కోలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న ఛెత్రీకి సెంట్రల్ ఆసియా ఫుట్‌బాల్ అసోసియేషన్ నేషన్స్ కప్ ప్రాబబుల్స్ కోసం ఎంపిక చేసిన బృందంలో చోటు దక్కలేదు. ఛెత్రీని తీసుకోకపోవడానికి కారణం ఏంటనేది తెలియడం లేదు. అటు భారత ఫుట్‌బాల్ సమాఖ్యగానీ, ఇటు కొత్త కోచ్ ఖలీత్ జమిల్‌గానీ ఈ విషయంలో ఎలాంటి కామెంట్ చేయలేదు. దాంతో, కొన్నేళ్లుగా బ్లూ టైగర్స్‌కు పెద్దన్నలా వ్యవహరించిన ఈ మాజీ సారథి అంతర్జాతీయ కెరీర్‌పై సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఛెత్రీ వీడ్కోలు గురించి ఆలోచించే అవకాశముందని విశ్లేషకులు అంటున్నారు.

నిరుడు జూన్‌లో వీడ్కోలు పలికిన ఛెత్రీ ఈ ఏడాది యూటర్న్ తీసుకున్నాడు. చెత్త ఆటతో వరుసగా ఓడిపోతున్న బ్లూ టైగర్స్‌ను విజయపథాన నడిపించేందుకు సిద్ధమయ్యాడు. అయినా సరే సెలెక్టర్లు అతడికి మొండిచేయి చూపించారు. నేషన్స్ కప్ కోసం ఎంపిక చేసిన 35 మందిలో ఛెత్రీ ఆడుతున్న బెంగళూరు ఎఫ్‌సీకి చెందిన ఆటగాళ్లు ఉన్నారు. గుర్‌ప్రీత్ సింగ్, రాహుల్ భెకే, రోషన్ సింగ్, సురేష్ సింగ్‌లను తీసుకున్న సెలెక్టర్లు స్టార్ ఫార్వర్డ్ అయిన ఛెత్రీని విస్మరించారు. ఆగస్టు 29న ఉజ్బెకిస్థాన్, తజకిస్థాన్ వేదికగా నేషన్స్ కప్ ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో భారత జట్టు గ్రూప్ బీలో ఉంది. ఇందులోనే ఆతిథ్య తజకిస్థాన్, ఇరాన్ అఫ్గనిస్థాన్ ఉన్నాయి.

## పిన్న వయసులోనే కెప్టెన్సీ..

### చరిత్ర సృష్టించనున్న ఇంగ్లండ్ కుర్రాడు..!

**లండన్:** అంతర్జాతీయ క్రికెట్‌లో విధ్వంసక బ్యాటింగ్‌తో చెలరేగుతున్న జాకబ్ బెథెల్ చరిత్ర సృష్టించనున్నాడు. చిన్నవయసులోనే కెప్టెన్సీ అందుకున్న ఇంగ్లండ్ క్రికెటర్‌గా రికార్డు పుస్తకాల్లో చోటు దక్కించుకోనున్నాడు. ఐర్లాండ్ పర్యటనకు హ్యారీ బ్రూక్‌కు విశ్రాంతినిచ్చిన సెలెక్టర్లు బెథెల్‌ను సారథిగా ఎంపిక చేశారు. దాంతో, ఆ దేశ చరిత్రలోనే చిన్న వయస్కుడైన నాయకుడిగా ఈ కుర్రాడు గుర్తింపు సాధించనున్నాడు. ఈరోజు అంటే.. ఆగస్టు 16 శనివారం నాటికి బెథెల్ వయసు.. 21 ఏళ్ల 329 రోజులు.

గత కొంతకాలంగా ఇంగ్లండ్ క్రికెట్‌లో భావి స్టార్లుగా ఎదుగుతున్న వాళ్లకు కెరీర్ ఆరంభంలోనే కెప్టెన్సీ ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. వెటరన్ ప్లేయర్లు అలెస్టర్ కుక్, ఇయాన్ మోర్గాన్, జోస్ బట్లర్‌లు 24 ఏళ్లకే సారథిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే.. బెథెల్‌కు మాత్రం 21 ఏళ్లకే ఆ హోదా దక్కడంతో అతడు పిన్న వయస్కుడైన కెప్టెన్‌గా అవతరిస్తాడు. ఆగస్టు 17 నుంచి ఐర్లాండ్‌తో మూడు టీ20ల సిరీస్ ఆడనుంది ఇంగ్లండ్. తొలి మ్యాచ్‌లో కెప్టెన్సీ వహించడం ద్వారా బెథెల్ తమ దేశ క్రీడా చరిత్రలో ఆల్‌టైమ్ రికార్డు నెలకొల్పనున్నాడు. ఆగస్టు 21న జరిగే ఆఖరి మ్యాచ్‌తో పొట్టి సిరీస్ ముగియనుంది.




**ఇంగ్లండ్ స్క్వాడ్ :** జాకబ్ బెథెల్ (కెప్టెన్), ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్, రెహాన్ అహ్మద్, సొన్ని బేకర్, టామ్ బాంటన్, లియాం డాసన్, టామ్ హర్ట్లే, విల్ జాక్స్, సకీబ్ మహమూద్, జేమీ ఓవర్టన్, మాథ్యూ పాట్స్, ఆదిల్ రషీద్, ల్యూక్ వుడ్.

జాకబ్ బెథెల్ కంటే ముందు ఇంగ్లండ్‌కు చిన్న వయసులోనే కెప్టెన్‌గా వ్యవహరించిన ఆటగాళ్లు వీరే.. మాంటీ పర్కేర్ బౌడెన్ - 23 ఏళ్ల 144 రోజులు వయసులో కెప్టెన్ అయ్యాడు. ఇవొ బ్లిఘ్ - 23 ఏళ్ల 292 రోజుల వయసులో, అలెస్టర్ కుక్ 24 ఏళ్ల 325 రోజుల వయసులో సారథ్యం స్వీకరించారు. ఇయాన్ మోర్గాన్ 24 ఏళ్ల 349 రోజులకు, స్టువార్ట్ బ్రాడ్ 25 ఏళ్ల ఒక రోజున, జోస్ బట్లర్ 25 ఏళ్ల 60 వ రోజున కెప్టెన్ అయ్యారు.

## అశ్విన్ చెప్పినదంతా అబద్ధమే

### ఐపీఎల్ నిబంధనల మేరకే బ్రెవిస్‌కు చెల్లించాం..!

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికా యువకెరటం డెవాల్డ్ బ్రెవిస్‌కు అడిగినంతా ముట్టజెప్పారనే వార్తలపై ఐపీఎల్ ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్ స్పందించింది. జూనియర్ డివిలియర్స్‌కు భారీగా ముట్టజెప్పారంటూ రవిచంద్రన్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలను సీఎస్కే యాజమాన్యం కొట్టిపారేసింది. రీప్లేస్‌మెంట్ ప్లేయర్ అయిన బ్రెవిస్‌ను నిబంధనలకు లోబడే తీసుకున్నామని వివరణ ఇచ్చింది. అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్లో చేసిన వ్యాఖ్యలను తిప్పికొడుతూ శనివారం సీఎస్కే ఫ్రాంచైజీ అధికారిక ప్రకటన చేసింది.

'డెవాల్డ్ బ్రెవిస్‌ను రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా తీసుకునే సమయంలో అన్ని నియమాలను పాటించాం. ఐపీఎల్ నియమాల, నిబంధనలకు లోబడే బ్రెవిస్‌ను తీసుకున్నామని స్పష్టత ఇస్తున్నాం' అని సీఎస్కే తమ పోస్ట్‌లో పేర్కొంది. ఐపీఎల్ ఆటగాళ్ల నియంత్రణ 2025-27 క్లాజ్6.6 ప్రకారం గాయపడిన క్రికెటర్‌కు ఎంత చెల్లించారో.. రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌కు అంతే చెల్లించాలి. సీజన్ మధ్యలో ఎంట్రీ ఇచ్చే ఆటగాళ్లకు మాత్రం ధరలో కొంత తగ్గించి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే.. అతడు చేరే సమయానికి జట్టు ఎన్ని మ్యాచ్‌లు ఆడింది? అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.

ఐపీఎల్ 18వ సీజన్ మధ్యలో సీఎస్కే బ్రెవిస్‌తో ఒప్పందం చేసుకుంది. గాయం



కారణంగా టోర్నీకి దూరమైన గుర్జన్‌ప్రీత్ సింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఈ సఫారీ ఆటగాడిని తీసుకుంది చెన్నై. ప్లేస్‌మెంట్ నిబంధనల ప్రకారం అతడికి రూ.2.2 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించింది. తనపై భారీ అంచనాలు పెట్టుకున్న ఫ్రాంచైజీ నమ్మకాన్ని నిలబెడుతూ.. ఆరు మ్యాచుల్లో ఈ చిచ్చరపిడుగు 180 స్ట్రయిక్ రేటుతో విరుచుకుపడ్డాడు. రెండు హాఫ్ సెంచరీలతో 225 రన్స్ కొట్టి చెన్నై విజయాల్లో కీలక పాత్ర పోషించాడీ హిట్టర్. ఐపీఎల్ ఫామ్‌ను కొనసాగిస్తూ ఆస్ట్రేలియాపై మెరుపు శతకం బాదాడు బ్రెవిస్. ఆసీస్‌తో జరిగిన రెండో టీ20లో సిక్సర్లతో హోరెత్తించిన ఈ యంగ్‌స్టర్ తొలి శతకంతో మెరిశాడు. కంగారూ బౌలర్లను ఊచకోత కోసిన ఈ చిచ్చరపిడుగు అజేయంగా 125 రన్స్‌తో జట్టును గెలిపించాడు.

ఆసీస్‌పై సెంచరీతో చెలరేగిన బ్రెవిస్ గురించి అశ్విన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్‌లో అతడికి చెన్నై కనీస ధరకంటే ఎక్కువ ఇచ్చిందని చెప్పాడు.

# ఆస్ట్రేలియా తొలి కోచ్.. 'గ్రేటెస్ట్ ఓపెనర్' సింప్సన్ ఇకలేరు

**సిడ్నీ:** ఆస్ట్రేలియా క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన మాజీ కెప్టెన్ బాబ్ సింప్సన్ కన్నుమూశాడు. టెస్టుల్లో ఆసీస్ ఆధిపత్యంలో కీలక పాత్ర పోషించిన ఈ ఆల్‌రౌండర్.. అనారోగ్యంతో 89 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచాడు. శనివారం సిడ్నీలోని తన నివాసంలో సింప్సన్ మరణించాడని ఆస్ట్రేలియా క్రికెట్ వెల్లడించింది. ఒక లెజెండరీ ఆటగాడిని కోల్పోయామని ట్వీట్ చేసింది ఆసీస్ బోర్డు.

'టెస్టు జట్టు సారథి, కెప్టెన్, కోచ్, జాతీయ సెలెక్టర్.. ఇలా ఎన్నో పాత్రల్ని పోషించిన బాబ్ సింప్సన్ ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఒక శిఖరం లాంటివాడు. మా దేశంలో క్రికెట్ అభివృద్ధికి ఆయన ఎంతో సేవ చేశాడు. ఒక దిగ్గజ ఆటగాడిని కోల్పోయాం. ఈ బాధాకరమైన సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, మిత్రులకు సానుభూతి తెలియజేస్తున్నాం' అని క్రికెట్ ఆస్ట్రేలియా పోస్ట్‌లో వెల్లడించింది.

### పదహారేళ్లకే అరంగేట్రం

విధ్వంసక ఆటగాడిగా పేరొందిన బాబ్ సింప్సన్ పదహారేళ్లకే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. న్యూ సౌత్ వేల్స్ జట్టు తరుపున ఆడిన అతడు లెగ్ స్పిన్నర్ కూడా. దేశవాళీలో ఆల్‌రౌండర్‌గా సత్తా చాటిన సింప్సన్ 1957లో





జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో శుభారంభాలు ఇస్తూ అనతికాలంలోనే విలువైన ఓపెనర్‌గా పేరు గడించాడు. 29 టెస్టుల్లో ఆస్ట్రేలియాకు సారథ్యం వహించిన సింప్సన్ 1968లో రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే.. జట్టుకోసం 1977లో మళ్లీ జెర్సీ వేసుకున్నాడు. అప్పుడు అతడి వయసు 41 ఏళ్లు. మొత్తంగా 62 టెస్టుల్లో 46.81 సగటుతో రాణించాడు. స్లిప్‌లో చురుకైన ఫీల్డర్‌గా ప్రశంసలు అందుకున్న ఈ వెటరన్.. లెగ్ స్పిన్‌తో బ్యాటర్లను బురిడీ కొట్టిస్తూ 71 వికెట్లు తీశాడు.

వీడ్కోలు తర్వాత 1986లో కోచ్‌గా పగ్గాలు చేపట్టాడు సింప్సన్. మరుసటి ఏడాదే జాతీయ సెలెక్టర్‌గా జట్టు ఎంపికలో కీలక పాత్ర పోషించాడు. క్రమశిక్షణ, కష్టపడేతత్వం కలిగిన ఆటగాళ్లనే తీసుకునే సంప్రదాయానికి శ్రీకారం చుట్టాడు సింప్సన్. అతడు సెలెక్టర్‌గా ఉన్నప్పుడే డేవిడ్ బూన్, డీన్ జోన్స్ స్టీవ్ వా, మెర్వ్ హ్యూస్ స్టార్లు ఆసీస్ క్రికెట్‌ను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లారు.



# చిరంజీవి బర్త్‌డేకు విశ్వంభర టీజర్ విడుదల?

### ఆసక్తిగా ఎదురు చూస్తున్న అభిమానులు

**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. అందులో విశ్వంభర భారీ బడ్జెట్ తో వస్తోంది. వశిష్ట డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమాను సోషియో ఫాంటసీ థ్రిల్లర్ గా తీసుకొస్తున్నారు. జెట్ స్పీడ్ తో షూటింగ్ జరుగుతోంది. త్వరలోనే రిలీజ్ కాబోతున్న ఈ సినిమా నుంచి భారీ అప్డేట్ రాబోతోంది. మూవీ టీజర్ ను ఇప్పటికే కట్ చేసినట్టు- తెలుస్తోంది. ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా టీజర్‌ను రిలీజ్ చేస్తున్నట్టు- తెలుస్తోంది. త్వరలోనే రిలీజ్ డేట్ ను ప్రకటించబోతున్నారు. ఇప్పటికే ఆర్ ఆర్ కూడా కంప్లీట్ అయిపోయిందంట. గతంలో వచ్చిన ఫస్ట్ గ్లింప్స్ పై కొన్ని విమర్శలు వచ్చాయి. వీఎఫ్ ఎక్స్ వీక్ గా ఉందనే ప్రచారం జరిగింది. అందుకే ఈసారి ఎలాంటి విమర్శలకు తావు లేకుండా చూస్తున్నారంట. వశిష్ట అన్నిరకాల జాగ్రత్తలు తీసుకున్న తర్వాతనే మెగా ఫ్యాన్స్ మెచ్చే విధంగా టీజర్‌ను కట్ చేయించినట్టు తెలుస్తోంది. చిరంజీవి కెరీర్ లోనే భారీ బడ్జెట్ తో వస్తున్న ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. త్రిష, అషికా రంగనాథ్ హీరోయిన్లుగా చేస్తున్నారు. కీరవాణి మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ సినిమాలో చిరంజీవి పాత కాలం నాటికి వెళ్లే సీన్స్ కూడా ఉంటయాంటున్నారు. వింటేజ్ చిరు లుక్ గురించి ఇప్పటికే చర్చ జరుగుతోంది. కాబట్టి చిరంజీవి లుక్ ఈ సినిమాలో మరింత ఇంటెస్ట్‌ను పెంచే అవకాశాలు ఉన్నాయి. ఈ టీజర్ తో మెగా ఫ్యాన్స్ ను సంతృప్తి పరిచేసి మూవీపై భారీగా అంచనాలు పెంచాలని చూస్తున్నారు. సెప్టెంబర్ లోనే మూవీ రిలీజ్ అవుతుందనే టాక్ మొన్నటి వరకు నడిచింది.

# త్వరలో ఆఫ్రికాకు రాజమౌళి

### అక్కడే కీలక సన్నివేశాల చిత్రీకరణ



**టాకీస్:** మహేష్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాపై ఆసక్తికరమైన అప్‌డేట్స్ వచ్చాయి. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా రాజమౌళి స్వయంగా ఈ సినిమా గురించి కొన్ని విషయాలు వెల్లడించారు. కేవలం కొన్ని ప్రెస్ మీట్‌లు లేదా అప్‌డేట్స్ ద్వారా సినిమా కథాంశాన్ని పూర్తిగా వివరించలేమని రాజమౌళి స్పష్టం చేశారు. సినిమా గురించి అప్పటికప్పుడు ఏది అప్‌డేట్ ఇవ్వాలో అదే ఇస్తామని తెలిపారు. దక్షిణాఫ్రికాలో ఇటీవల జరిగిన అల్లర్ల కారణంగా అక్కడ ప్లాన్ చేసిన షూటింగ్ వాయిదా పడింది. సెప్టెంబర్ రెండో వారంలో సౌత్ ఆఫ్రికాలో షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. సౌత్ ఆఫ్రికా షెడ్యూల్ ఆలస్యం కావడంతో, ఈ మధ్య హైదరాబాద్‌లోనే హీరోయిన్‌తో కొన్ని కీలక సన్నివేశాలను షూట్ చేశారు. ప్రస్తుతం షూటింగ్స్ నిలిచిపోయిన నేపథ్యంలో సౌత్ ఆఫ్రికా షెడ్యూల్ కోసం బిజీగా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో మునిగి పోయారు రాజమౌళి. ఈ క్రమంలో బాడీ ట్రాన్స్ఫర్మేషన్ మీద మహేష్ ఫోకస్ పెట్టాడు. ఈ సినిమా మహేష్ బాబు కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, రాజమౌళి స్థాయికి తగ్గట్టుగా భారీ బడ్జెట్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో తెరకెక్కుతుందని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాలో మహేష్ బాబుతో పాటు- పృథ్వీ రాజ్ సుకుమారన్ తో పాటు- ప్రియాంక చోప్రా కీలక పాత్రలలో నటిస్తున్నారు.

# నాకు జరిగిన అన్యాయాలను త్వరలోనే వెల్లడిస్తా..

### ఆరోజు పెద్ద యుద్ధమే జరుగుతుంది: ఉదయభాను

ఇండస్ట్రీలో యాంకరింగ్‌ను కొన్ని గ్రూపులు సిండికేట్‌గా మార్చాయన్న ఉదయభాను

తనకు సమాచారం ఇవ్వకుండానే ప్రాజెక్ట్ నుంచి తీసేసిన సందర్భాలు చాలా ఉన్నాయని వ్యాఖ్య

తనకు ఇచ్చిన చెక్కులు ఎన్ని బౌన్స్ అయ్యాయో ఇంటికి వచ్చి చూస్తే తెలుస్తుందన్న భాను




టాకీస్: ఒకప్పుడు బుల్లితెరపై యాంకర్ గా ఒక వెలుగు వెలిగిన ఉదయభాను ఆ తర్వాత కాస్త నెమ్మదించారు. పెళ్లి చేసుకుని, పిల్లలకు జన్మనిచ్చిన ఉదయభాను చాలా కాలంపాటు కుటుంబానికే అంకితమయ్యారు. ఇప్పుడు తాజాగా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. తాజాగా ఓ ప్రమోషన్స్ ఈవెంట్, మరో ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ఆమె మాట్లాడుతూ... ఇండస్ట్రీలో యాంకర్ లకు ఎదురవుతున్న అసమానతలపై గళమెత్తారు. ఇండస్ట్రీలోని కొన్ని గ్రూపులు యాంకరింగ్ ను సిండికేట్ గా మార్చేశాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఆమె చేసిన వ్యాఖ్యలపై కొందరు విమర్శలు కూడా గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉదయభాను మాట్లాడుతూ... ఈ రంగంలో తనకు ఎదురైన అనుభవాలే తనను అలా మాట్లాడేలా చేశాయని చెప్పారు. ఎన్నోసార్లు ఈవెంట్ కు రెడీ అయి వెళ్లిన తర్వాత... ఆ ఛాన్స్ మరొకరికి వెళ్లిందని తెలిసి వెనక్కి వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయని ఆమె తెలిపారు. కొన్ని ఛానల్స్ తన డేట్స్ తీసుకుని... ఆ తర్వాత తనకు సమాచారం కూడా ఇవ్వకుండానే ప్రాజెక్ట్ నుంచి తీసేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'హయ్యెస్ట్ పెయిడ్ యాంకర్' అంటూ తనకు ట్యాగ్ వేసినప్పటికీ... వాస్తవ పరిస్థితి వేరని ఆమె అన్నారు. తనకు ఇచ్చిన చెక్కులు ఎన్ని బౌన్స్ అయ్యాయో తమ ఇంటికి వచ్చి చూస్తే తెలుస్తుందని ఉదయభాను తెలిపారు. తాను ఎప్పుడూ సెలెక్టివ్ గా ఉంటానని చెప్పారు. చిన్న ఇంటర్వ్యూలు చేస్తే చిన్న యాంకర్ల భవిష్యత్తు దెబ్బతీసినట్టు అవుతుందనే భావనతో చిన్న ఇంటర్వ్యూలు ఒప్పుకునేదాన్ని కాదని తెలిపారు. త్వరలోనే అన్ని విషయాలను బహిర్గతం చేస్తానని... ఆ రోజు వచ్చినప్పుడు పెద్ద యుద్ధాలే జరుగుతాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీలో తనకు జరిగిన అన్యాయాలను బహిరంగంగా చెపుతానని... ఆరోజు పెద్ద రచ్చ జరుగుతుందని చెప్పారు. తాను ఎవరినో కించపరచడానికి మాట్లాడటం లేదని... వచ్చే తరం వారికి కొద్దిపాటి అవగాహ న కల్పించేందుకే మాట్లాడుతున్నానని అన్నారు. తన అభిప్రాయాలలో ఉండే ఫిలాసఫీ కెరీర్ నేర్పిన జీవిత పాఠాల వల్ల వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ఒక పుస్తకాన్ని రాస్తున్నానని చెప్పారు.

# పవన్ కల్యాణ్ 'ఓజీ' నుంచి ప్రియాంక అరుల్ మోహన్ లుక్ విడుదల

### 'కన్మణి' పాత్ర లుక్ విడుదల చేసిన మేకర్స్

టాకీస్: పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'ఓజీ' నుంచి ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న ప్రియాంక అరుల్ మోహన్ ఫస్ట్ లుక్‌ను శనివారం చిత్ర బృందం అధికారికంగా విడుదల చేసింది. ఈ చిత్రంలో ఆమె 'కన్మణి' అనే పాత్రలో కనిపించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ పోస్టర్‌కు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది.
'రన్ రాజా రన్', 'సాహో' చిత్రాల ఫేమ్ సుజీత్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కల్యాణ్‌ను మునుపెన్నడూ చూడని శక్తివంతమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో చూపించబోతున్నారు. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ 'ఓజాస్ గంభీర' అనే పాత్రలో నటిస్తుండగా, ఆయన సరసన ప్రియాంక అరుల్ మోహన్ నటిస్తున్నారు. తాజా పోస్టర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.
ప్రముఖ నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. భారీ తారాగణంతో, ఉన్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# త్వరలోనే నాగ్ కొత్త సినిమా ప్రకటన



**టాకీస్:** చిరంజీవి, వెంకటేష్, బాలకృష్ణ సరికొత్త రికార్డులు సృష్టిస్తుంటే.. కింగ్ నాగార్జున మాత్రం గట్టి కంబ్యాక్ కోసం కష్టపడుతున్నారు. 2022లో వచ్చిన బంగార్రాజు తర్వాత నాగ్ పెద్దగా హిట్ చూడలేదు. బ్రహ్మాస్త్ర హిట్ అయినప్పటికీ అది రణబీర్, అమితాబ్ బచ్చన్ ఖాతాలోకి చేరిపోయింది. ఆ తర్వాత వచ్చిన ది గోస్ట్ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టగా.. నా సామి రంగా పర్లేదనిపరచింది. కింగ్ హీరోగా కాస్త బ్రేక్ ఇచ్చి.. సపోర్టింగ్ అండ్ స్పెషల్ రోల్స్‌కు షిఫ్టయ్యారు. నాగార్జున ఇటీ-వలే ధనుష్ 'కుబేర'తో ప్రేక్షకుల్ని అలరించారు. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు. ఈ సినిమాలో నాగ్ విలన్‌గా నటించారు. అయితే కింగ్ కొత్త సినిమా విషయంలో మాత్రం క్లారిటీ- రావడం లేదు. కానీ ఇప్పటికే నాగ్ కొత్త సినిమాపై గట్టిగా కసరత్తులు చేస్తున్నారు. ఈసారి ఆయన తమిళ దర్శకుడితో మైల్‌స్టోన్ మూవీ చేయబోతున్నట్టు-గా తెలుస్తోంది. 'రా.కార్తీక్' దర్శకత్వంలో నాగార్జున సినిమా చేయబోతున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను 'కింగ్ 100' వర్కింగ్ - టైటిల్‌తో మొదలు పెట్టబోతున్నారు. తాజా అప్డేట్ ప్రకారం.. ఈ చిత్రాన్ని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 29న ప్రకటించనున్నట్లు సమాచారం. దీనికోసం ఇప్పటికే ఓ లుక్‌ను కూడా సిద్ధం చేసినట్లు- తెలుస్తోంది. అన్నపూర్ణ స్టూడియోను ప్రారంభించి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను నాగ్ తమ సంస్థలోనే స్వయంగా నిర్మించనున్నారట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటు-న్న ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలుకానుందని సమాచారం.




# బెంగాల్ ఫైల్స్ ట్రైలర్ విడుదల

**టాకీస్:** 'ది కశ్మీర్ ఫైల్స్', 'ది తాష్కెంట్ ఫైల్స్' వంటి వివాదాస్పద చిత్రాలతో గుర్తింపు పొందిన దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం ది బెంగాల్ ఫైల్స్. ఈ సినిమాను అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రయూనిట్ మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది. అభిషేక్ అగర్వాల్, పల్లవి జోషి సహనిర్మాతలుగా వ్యవహరించిన ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, పల్లవి జోషి, గోవింద్ నామ్‌దేవ్ వంటి ప్రముఖ నటు-లు కీలక పాత్రల్లో నటించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.